చౌకధరల దుకాణాలకు మళ్లీ ప్రాణం

రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ కాలం నుంచి చౌకధరల దుకాణాల్లోనే అర్హులైన పేద ప్రజలకు బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులు పంపిణీ చేసేవాళ్లు. దాదాపు ప్రతి గ్రామంలోనూ దుకాణాల వద్దకు వెళ్లి పేదలు నిత్యావసర సరుకులు తెచ్చుకునేవారు. దశాబ్దాల పాటు కొనసాగిన ఈ విధానానికి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంగళం పాడింది. ఎండీయూ (మొబైల్ డిస్పెన్సరీ యూనిట్) వాహనాలను ఏర్పాటు చేసి ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు 2021లో పథకాన్ని ప్రారంభించగా అది విజయవంతం కాకపోవడంతో ప్రస్తుత ప్రభుత్వం దానిని రద్దు చేసింది. దీంతో నాలుగు సంవత్సరాల తర్వాత చౌకధరల దుకాణాలకు మళ్లీ ప్రాణం వచ్చిందనే చెప్పవచ్చు.

- 1 నుంచి దుకాణాల్లోనే సరుకుల పంపిణీ
- సక్సెస్ కాని డోర్ డెలివరీ.. అందుకే రద్దు..
- వృద్ధులు, వికలాంగులకు మినహాయింపు
- డోర్ డెలివరీ వాహనదారుల రుణాలు చెల్లించనున్న ప్రభుత్వం



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ వ్యవస్థ ఏర్పడిన 1974 నుంచి చౌకధరల దుకాణాల ద్వారానే పేద ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసేవాళ్లు. కాంగ్రెస్ పార్టీ హయాంలో ఈ విధానం అమలులోకి వచ్చినప్పటికీ ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో తెచ్చిన కిలో రెండు రూపాయల బియ్యం పథకంతో వీటికి ప్రాధాన్యత పెరిగిపోయింది. అప్పట్లో ప్రజలకు బియ్యంతో పాటు కిరోసిన్, చక్కెర, కందిబేడలు ఇచ్చేవాళ్లు. తర్వాత వచ్చిన అన్ని ప్రభుత్వాలు తమ బ్రాండ్ చూపించుకునేందుకు ప్రజలకు అందించే నిత్యావసర సరుకుల నాణ్యతను పెంచారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మాత్రం బియ్యంతో పాటు ఇతర సరుకుల నాణ్యతపైన దృష్టి పెట్టలేదనే విమర్శలు ఉన్నాయి. అయితే ఇంటి వద్దకే వాహనాల్లో వచ్చి నిత్యావసర సరుకులు పంపిణీ చేయడాన్ని ప్రారంభించారు. గతంలో ఇస్తున్న బియ్యంకు బదులుగా సన్నబియ్యం ఇస్తామని కూడా అర్భాటంగా ప్రకటించారు. అయితే ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక రోజు కూడా సన్నబియ్యం పంపిణీ చేయలేదు. జిల్లాలో మొత్తం 1123 చౌకదుకాణాలు, 4,97,969 రేషన్‌కార్డులు, 310 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. జిల్లాలో సగటున కనిష్టంగా ఒక్కో చౌకధరల దుకాణానికి 800 కార్డులు, గరిష్టంగా 2500 ఉన్నాయి. పట్టణ ప్రాంతాలలో ఒక్కో వాహనానికి 2500 కార్డుల చొప్పున కేటాయించారు. పల్లెల్లోనూ మూడు, నాలుగు దుకాణాలను కలిపి 1500 నుంచి 2000 కార్డులను పంపిణీ చేశారు.

విజయవంతం కాని ఇంటింటికీ పంపిణీ

వైసీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ఇంటింటికీ నిత్యావసర సరుకుల పంపిణీ విజయవంతం కాలేదు. అటు పల్లెలు, ఇటు పట్టణాల్లోనూ ఈ పథకం విజయవంతం కాలేదు. ఎక్కడా ఇంటింటి వద్దకు వాహనాలు వెళ్లి నిత్యావసర సరుకులు ఇవ్వలేదు. నెట్‌వర్క్ సమస్య వీధులు సక్రమంగా లేక అక్కడికి వాహనాలు వెళ్లలేక పోవడం.. కొన్నిచోట్ల వైసీపీ నాయకులు తమ ఇళ్ల వద్ద వాహనాలను నిలిపి నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం.. వంటి సమస్యల వల్ల దాదాపుగా ఏ ఊరిలోనూ కనీసం ఒక నెల అయినా ఇంటింటి వద్దకే లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు ఇవ్వలేదనే చెప్పవచ్చు. వీధిలో ఎక్కడో ఒకచోట వాహనాన్ని నిలిపి అందరినీ అక్కడికే పిలిపించి సరుకులు పంపిణీ చేశారు. దానికి తోడు గతంలో చౌకదుకాణాల్లో అయితే 1వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటలోపు వెళ్లి తెచ్చుకునేవాళ్లు. అయితే ఈ వాహనాల ద్వారా అయితే వాళ్లు వచ్చిన సమయానికి ఇంటి వద్దే వేచి ఉండి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో ఈ పథకం అమలులో ఉన్న ఇబ్బందులు, వైఫల్యాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం డోర్ డెలివరీ విధానాన్ని రద్దు చేసింది. వచ్చే నెల 1 నుంచి చౌకధరల దుకాణాల్లోనే సరుకులు తెచ్చుకోవాలని ప్రకటించింది. దీనిపైన చౌక దుకాణాల డీలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డ్రైవర్ల రుణాలు తీర్చనున్న ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వం ఈ పథకం కోసం వాహనాల డ్రైవర్ల పేర్ల మీదే బ్యాంకుల్లో రుణాలు ఇచ్చి వాహనాలు కొనిచ్చింది. ఆ రుణం తీరేందుకు వారి జీతంలోనే నెలనెలా చెల్లించే విధంగా చేసింది. నాలుగేళ్లలో సుమారుగా చాలా వరకు వాహనాల బకాయిలు చెల్లించినా ఇంకా కొన్ని నెలలు మిగిలి ఉన్నాయి. దీంతో మిగిలిన రుణాన్ని ప్రభుత్వమే చెల్లించి ఆ వాహనాన్ని ఆ డ్రైవర్‌కే ఇవ్వనుంది. అదే సమయంలో 65 సంవత్సరాలు దాటిన వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే నిత్యావసర సరుకుల పంపిణీ బాధ్యతను ఆయా డ్రైవర్లకు అప్పగించింది. నెలలో 5 రోజులు ఈ పనిలో ఉన్నా మిగిలిన రోజులు తమ సొంతానికి వాహనాలను ఉపయోగించుకోవచ్చని పేర్కొంది.

ఉన్నట్టుండి వీధిన పడేశారు



నా పేరు మీద వాహనం ఇచ్చారు. మూడు షాపుల లబ్ధిదారులకు డోర్ డెలివరీ చేస్తూ 1500 కార్డులకు బియ్యం అందించేవాడిని. ప్రభుత్వం నెలకు రూ.21 వేలు జీతం ఇచ్చేవాళ్లు. దీంతో బండి కంతులు పోను ఉన్న డబ్బు కుటుంబ అవసరాలకు ఉపయోగపడేది. దీనిని నమ్ముకుని పనిచేసేవాళ్లం. ఉన్న ఫలంగా రోడ్డున పడేశారు. కుటుంబాన్ని ఎలా పోషించాలి. ఒకసారిగా ఇబ్బందులు కలిగించడం బాధాకరం. రుణాలు మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుందంటున్నారు. అయినా నెలనెలా జీతం రాకపోతే ఇబ్బందిగా ఉంటుంది.

- షేక్ ఫజల్, ఎండీయూ ఆపరేటర్, శెట్టిపల్లె

15లోపు సరుకులు అందించేవాళ్లం



ప్రతి నెల 15లోపు లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసే వాళ్లం.. ఎండీయూ ఆపరేటర్లను పెట్టినా, పెట్టకపోయినా. నిత్యావసర సరుకుల పంపిణీ గతంలో సక్రమంగానే జరిగేది. వైసీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ నిత్యావసర సరుకుల సరఫరా పేరుతో ఎండీయూ ఆపరేటర్లను పెట్టారు. వాళ్లు అదే పనిచేసినా.. మాకు అదనపు బాధ్యతగా ఉండేది. ప్రస్తుతం రద్దు చేయడంతో పూర్తి బాధ్యత మాకు అప్పచెప్పడం సంతోషమే.

- మూడే తులసీనాయక్, పెద్దబిడికి, సంబేపల్లె

ఐఎఫ్ఎస్‌లో బాలాజీకి 65వ ర్యాంకు

- గాలివీడు వాసి ప్రతిభ



అంబటి బాలాజీ

గాలివీడు, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరెడ్డిగారిపల్లెకు చెందిన అంబటి బాలాజీ యూపీఎస్సీ నిర్వహించిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్) 2024 తుది ఫలితాల్లో 65వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ తన తాత అంబటి వెంకట్రమణ, తల్లిదండ్రులు రఘునాథ, రామలక్షుమ్మతో పాటు కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైందన్నారు. ఇంటర్ వరకు రాజంపేటలోని జవహర్ నవోదయ విద్యాలయంలో, ఇంజనీరింగ్ (బీటెక్- ఈసీఈ) ఎస్వీ యూనివర్సిటీలో పూర్తి చేశాక సివిల్స్‌కు ఒక సంవత్సరం కోచింగ్ తీసుకున్నానని తెలిపారు. అనంతరం సొంత ప్రిపరేషన్ కొనసాగిస్తూ 2020లో గ్రామ, వార్డు సచివాలయం పరీక్ష రాయగా స్టేట్ ఫస్ట్ ర్యాంకు వచ్చిందని, కొద్ది నెలలు మాత్రమే ఉద్యోగం చేసి అనంతరం ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి మళ్లీ సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యానని తెలిపారు. 2023 సివిల్స్ తరహాలోనే సెంట్రల్ గవర్నమెంట్‌లో ఈపీఎఫ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో జాయిన్ అయ్యానని, ప్రస్తుతం సివిల్స్ ఐఎఫ్ఎస్‌లో సెలెక్ట్ అయ్యానని తెలిపారు. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు ఎంపిక కావడం ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని, ఐఏఎస్ సాధించాలన్నదే తన అంతిమ లక్ష్యమని ఆయన తెలిపారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్




రాయచోటిలోని డైట్ హాస్టల్ ఆవరణలో యోగా కార్యక్రమంలో కలెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్, తదితరులు

రాయచోటిటౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక ఆరోగ్యం, భావోద్వేగాల సమతుల్యతలు యోగాతోనే సాధ్యమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం రాయచోటి పట్టణంలోని మున్సిపల్ పార్కులో నిర్వహించిన యోగాంధ్రలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా అధికారులు పాల్గొని యోగా చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో నేటి నుంచి జూన్ 21వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. యోగా ద్వారా లభించే శారీరక, మానసిక ఉపయోగాలను ప్రజలందరికీ తెలియజేస్తామన్నారు. ప్రతి ఇంటిలో కనీసం మూడు తరాలకు చెందిన వారికి శిక్షణ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జూన్ 21న విశాఖపట్టణంలో జరగబోయే యోగాడే కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాల్గనబోతున్నారని, ప్రత్యక్షంగా 5 లక్షల మంది రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల మందిని ఆ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అయ్యో..పాపం చిన్నారి...



రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి



6

ఆ అతిథి గృహానికి 154 ఏళ్లు
- హార్సిలీహిల్స్‌కు తలమానికం..

26 నుంచి ఏపీఆర్‌జేసీ కౌన్సెలింగ్

పీలేరు, మే 21 (ఆంధ్రజ్యోతి): గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాల కోసం ఈనెల 26వ తేదీ నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఏపీఆర్‌జేసీ రాయలసీమ కన్వీనర్ డాక్టర్ ఎం.చెన్నకేశవులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంతంలోని బాలురకు 26వ తేదీ కేవీపల్లె మండలం గ్యారంపల్లెలోని జూనియర్ కళాశాలలో, బాలికలకు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు సమీపంలోని బనవాసి గురుకుల జూనియర్ కళాశాలలో కౌన్సెలింగ్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. 26వ తేదీ ఎంపీసీ, 27న బైపీసీ, 28న ఎంఈసీ, సీఈసీ గ్రూపులకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. కౌన్సెలింగ్ కోసం అర్హత సాధించిన విద్యార్థులు ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో ఉన్న తమ కాల్ లెటర్లు డౌన్‌లోడ్ చేసుకుని కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు గ్యారంపల్లె, కొడిగెనహళ్లి, కర్నూలు, నాగార్జునసాగర్ కళాశాలల్లో తమకు నచ్చిన కళాశాలలను ఎంచుకోవచ్చునన్నారు. వృత్తి విద్యా కోర్సులకు మాత్రం కృష్ణా జిల్లాలోని నిమ్మకూరు కళాశాలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా నాగార్జునసాగర్‌లోని డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కౌన్సెలింగ్ కోసం అర్హత సాధించిన వారు పైన పేర్కొన్న వెబ్‌సైట్ నుంచి తమ కాల్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకుని గుంటూరు పాత బస్టాండు సమీపంలోని పరీక్ష భవన్‌లో ఈనెల 30వ తేదీ జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఏపీ గురుకుల పాఠశాలల్లో 5, 6, 7, 8 తరగతుల్లో మిగులు సీట్ల ప్రవేశాలకు ఎంపికైన అభ్యర్థుల ప్రొవిజనల్ సెలక్షన్ లిస్టు పైన పేర్కొన్న వెబ్‌సైట్‌లో ఉందని ఆయన తెలిపారు. సీటు సాధించిన విద్యార్థులు ఆ వెబ్‌సైట్ నుంచి తమ సెలక్షన్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఈనెల 30వ తేదీ లోపు వారికి కేటాయించిన పాఠశాలల్లో తమ సర్టిఫికెట్లు అందజేయాలని ఆయన తెలియజేశారు.

వైసీపీ కంచుకోటలో సైకిలెక్కిన 120 కుటుంబాలు



ముక్కా రూపానందరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

రైల్వేకోడూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీకి కంచుకోట అయిన వెంకటరెడ్డిపల్లెలో బుధవారం 120 కుటుంబాల వారు టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. మొదట ప్రధాన దారి నుంచి వెంకటరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ కేంద్రం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఊరంతా పసుపు జెండాలతో నిండిపోయింది. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ముక్కా మాట్లాడుతూ కొన్నేళ్ల తర్వాత వైసీపీ అడ్డాలో తొలిసారిగా పసుపు జెండా ఎగరడం టీడీపీకి కొత్త యుగానికి నాంది పలికిందన్నారు. అభివృద్ధి కేవలం ఒక చంద్రబాబు తోనే సాధ్యం అవుతుందని ప్రజల్లో నమ్మకం ఏర్పడిందన్నారు. సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీపైన నమ్మకంతో వెంకటరెడ్డిపల్లె గ్రామ ప్రజలు ఇంతమంది భారీ ఎత్తున చేరడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్ రెడ్డి, వెంకటరెడ్డిపల్లెకు చెందిన గండ సుబ్బరామిరెడ్డి, గండ ప్రభాకర్‌రెడ్డి, గండ రాజారెడ్డి యమ్మసాని ఈశ్వర్‌రెడ్డి, నాగోలు వెంకటరెడ్డి, నాగోలు రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహా డిమాండ్..!

కడపలో టీడీపీ నిర్వహించనున్న మహానాడు సందర్భంగా రెండురోజుల పాటు దాదాపు 25వేల మందికి పైగా ఇక్కడే బస చేయనున్నారు. దీంతో లాడ్జీలు, హోటల్స్‌లో గదుల అద్దెను ఒక్కసారిగా పెంచేశారు. ఇప్పటికే గదులన్నీ రిజర్వ్ అయిపోయాయి. రానున్న అతిథులకు సరిపడా వసతుల ఏర్పాటుకోసం టీడీపీ నేతలు ప్రత్యామ్నాయ మార్గాలను వెదుకుతున్నారు. ఇక్కడి లాడ్జీల్లో ధరలను చూసి పలువురు నంద్యాల, ఆళ్లగడ్డలో రూములు బుక్ చేసుకుంటున్నారు.

- లాడ్జీలు, హోటల్స్‌లో గదుల అద్దెలు డబుల్
- రేట్లు చూసి నోరువెళ్లబెడుతున్న జనం
- మూడురోజుల పాటు నో రూమ్స్



(కడప-ఆంధ్రజ్యోతి): కడప గడపలో టీడీపీ తొలిసారిగా మహానాడు నిర్వహిస్తోంది. ఈ నెల 27, 28, 29 తేదీలలో నగర శివార్లలోని పబ్బాపురంలో మహానాడు జరగనుంది. ఈ మూడురోజుల కార్యక్రమానికి ఏపీ, తెలంగాణ నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, అండమాన్ నికోబార్, విదేశాల నుంచి భారీ ఎత్తున తెలుగు తమ్ముళ్లు తరలిరానున్నారు. మూడురోజుల పాటు జరిగే మహానాడులో తొలి రెండురోజులు ప్రతినిధుల సభ నిర్వహిస్తారు. ఇప్పటికే 23వేల మందికి ఆహ్వానాలు పంపారు. చివరి రోజు ఐదు లక్షల మందితో బహిరంగసభ నిర్వహించాలని నిర్ణయించారు. చివరి రోజు బహిరంగ సభను మినహాయిస్తే తొలి రెండు రోజులు ప్రతినిధుల సభకు వచ్చే 23వేల మంది కార్యకర్తలకు బస కల్పించాల్సి ఉంది. వారితో పాటు మంత్రులు, వారి వెంట వచ్చే అనుచరులు కలిపి 25వేల దాకా ఉండచ్చని అంచనా. అయితే ఇంత స్థాయిలో వసతులు కల్పించేందుకు జిల్లాలో లాడ్జీలు, హోటల్స్ లేవు. అందుకే టీడీపీ నేతలు జిల్లాలో ఉన్న వీఐపీల కోసం గెస్ట్‌హౌస్‌లు, విల్లాస్, ప్రైవేటు ఫంక్షన్‌హాల్స్, ప్రైవేటు విద్యాసంస్థల హాస్టల్స్‌ను బస కోసం తీసుకున్నారు. అయినా ఇంకా సరిపోని పరిస్థితి నెలకొంది.

ధర పెంచేశారు

మహానాడు వేళ కడప, అన్నమయ్య జిల్లాల్లోని హోటల్స్‌కు ఎనలేని గిరాకీ ఏర్పడింది. మామూలుగా అయితే హోటల్స్‌లో గది తీసుకుంటే 24గంటలకు చార్జి చేస్తారు. సంక్రాంతి సమయంలో అయితే కోస్తాలో కోళ్లపందాలు ఎక్కువగా జరుగుతాయి. భీమవరంలో హోటల్స్‌కు డిమాండ్ ఉంటుంది. ఆ మూడురోజులు 24గంటలకు బదులు 12గంటల చొప్పున గదులకు చార్జ్ చేస్తారు. ఇప్పుడు మహానాడుతో ఒక్కసారిగా కడపలో హోటల్స్, లాడ్జీల్లో గదుల ధరలకు రెక్కలొచ్చాయి. ఉమ్మడి జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, రాజంపేట, రాయచోటిలో ప్రధాన హోటల్స్ ఉన్నాయి. ఇక పోరుమామిళ్ల, బద్వేలు, మైదుకూరులోనూ ఓ మోస్తరు హోటల్స్ ఉన్నాయి. కడపలో 150, ప్రొద్దుటూరులో 150 గదులు, రాయచోటిలో సుమారు వంద గదులు అందుబాటులో ఉంటాయి. సాధారణ రోజుల్లో కడపలో సింగిల్ రూం రూ.1500 నుంచి రూ.2వేల మధ్య, డబుల్ రూం రూ.2వేల నుంచి రూ.2500 లోపు దొరికేది. సూట్ కూడా రూ.3వేల లోపు ఉండేది. అయితే మహానాడు నేపథ్యంలో అంతకు అంత రేట్లు పెంచేశారు. అంటే రూ.2,500 ఉన్నది ఐదారువేలు దాకా పెంచేశారు.

లాడ్జీలన్నీ ఫుల్.. వసతుల కోసం అవస్థలు

27, 28 తేదీలలో రెండురోజుల పాటు నిర్వహించే ప్రతినిధుల సభకు వచ్చే 25వేల మందికి వసతులు కల్పించేందుకు టీడీపీ నేతలు అందుబాటులో ఉన్నవన్నీ తీసుకుంటున్నారు. కడపలోని హోటల్స్ లాడ్జీల రూములన్నీ ఫుల్ అయిపోయాయి. టీడీపీ వాళ్లు ఏ హోటల్ వద్దకు వెళ్లినా ఆ రెండు రోజుల్లో ఖాళీ లేవంటూ సమాధానమిస్తున్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నారు, అన్నీ ఫుల్ అయ్యాయని చెబుతున్నారు. అదే వేరేవాళ్లు వెళితే రూ.6వేలు అని చెప్పి బేరమాడితో చివరకు రూ.5వేలకు ఇస్తుండడం గమనార్హం. ఫుల్ కాకపోయినా ఫుల్ అయినట్లు చెప్పేసి బయట వారికి రెంట్‌కు ఇస్తున్నారు. మహానాడు నిర్వహణతో కడప పేరు మారుమోగుతోంది. ఈ నేపథ్యంలో హోటల్స్‌లో గదుల ధర పెంచడం చూసి చెడ్డపేరు వస్తుందని, బయటి నుంచి రావాలంటే భయపడుతున్నారని టీడీపీ నేతలు వాపోతున్నారు. ఇక్కడ రేట్లను చూసి కొందరు ఆళ్లగడ్డ, నంద్యాల, కర్నూలు ప్రాంతాల్లో కూడా రూములు బుక్ చేశారు. ఇదంతా జాతీయ రహదారి కావడంతో 2 నుంచి 3గంటల్లోపు చేరుకోవచ్చని కొందరు బయట తీసుకుంటున్నారు. కడపలోని లాడ్జీల్లో ఇష్టారాజ్యంగా రేట్లను పెంచడం చూసి పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి మహానాడు వేళ హోటల్స్ డిమాండ్ చేసే ధర చూసి వామ్మో.. అనుకునే పరిస్థితి వచ్చింది.

మహానాడు పనులు ముమ్మరం

- బహిరంగసభ వేదిక నేటితో పూర్తి
- నిర్విరామంగా సాగుతున్న పనులు



చురుగ్గా జరుగుతున్న మహానాడు పనులు

(కడప-ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రతిష్టాత్మకంగా ఈనెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న మహానాడుకు సంబంధించి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షం వల్ల పనులకు అడ్డంకులు వస్తున్నప్పటికీ వేగంగా వేదికను సిద్ధం చే స్తున్నారు. వేదిక ఏర్పాట్లకు సంబంధించి ఎమ్మెల్సీలు రాంగోపాల్‌రెడ్డి, బీద రవిచంద్ర, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, మాజీ ఎమ్మెల్సీ సత్యంరాజు, ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. బుధవారం సాయంత్రం నాటికి పనులు కీలక దశకు చేరుకున్నాయి. మహానాడులో తొలి రెండు రోజులు 23వేల మందితో ప్రతినిధుల సభ జరగనుంది. దీనికి సంబంధించి వేదిక దాదాపు పూర్తి కావచ్చింది. వర్షం వచ్చినా తడవకుండా ఉండేందుకు కొత్త టెక్నాలజీతో ప్రధాన వేదికను, గ్యాలరీని సిద్ధం చేస్తున్నారు. 29వ తేదీన జరిగే బహిరంగ సమావేశానికి వేదిక దాదాపు పూర్తికావచ్చింది. బహిరంగసభకు దాదాపు 50వేలకు పైగా వాహనాలు వస్తాయని అంచనా వేస్తున్నారు. వీటికి సంబంధించి రాయచోటి, పులివెందుల రోడ్డులోని ఖాళీ ప్రదేశాల్లో పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఆ ప్రదేశంలోని చెట్లు, ముళ్లపొదలు తొలగించి వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండురోజుల్లో పార్కింగ్ అందుబాటులోకి వస్తుంది. కమ్యూనికేషన్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఎయిర్‌టెల్, జియో, బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించి నాలుగు మొబైల్ టవర్లను ఏర్పాటు చేశారు. ఇక బ్రాడ్‌బాండ్ కనెక్షన్ కోసం ఫైబర్‌నెట్ కూడా తీసుకున్నారు.

- విద్యార్థుల నైపుణ్యానికి పెద్దపీట
- కోర్సులు పూర్తి కాగానే ఉద్యోగావకాశాలు
- ఈనెల 24 వరకే దరఖాస్తుకు గడువు

ఐటీఐలో శిక్షణ...ఉపాధికి నిచ్చెన



తంబళ్లపల్లెలోని టీఎన్‌వీఎస్‌ఆర్‌ఎం ప్రభుత్వ ఐటీఐ



తంబళ్లపల్లె ఐటీఐలో ఫిట్టర్ ట్రేడ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

తంబళ్లపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి): యువతలో తక్కువ సమయంలోనే నైపుణ్యాలు పెంపొందించి త్వరగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఐటీఐ (పారిశ్రామిక శిక్షణా సంస్థ)లు ఎంతగానో దోహదపడుతున్నాయి. యువతకు తక్కువ కాల వ్యవధిలో వివిధ ట్రేడ్లలో శిక్షణ ఇచ్చి వారి భవిష్యత్తుకు సోపానమార్గాలుగా మారుతున్నాయి. ఐటీఐ ట్రేడ్‌లలో ఏ కోర్సు పూర్తి చేసినా ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రధానంగా రైల్వే, రక్షణ, ఆర్మీ, ఆర్టీసీ, విద్యుత్ వంటి ప్రభుత్వ, ఇతర ప్రైవేటు రంగ సంస్థల్లో ఉద్యోగావకాశాలు పొందడానికి అవకాశం ఉంటుంది. పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పనలో ఐటీఐ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. ఇక స్వయంగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

ఐటీఐతో మంచి ఉపాధి అవకాశాలు



తక్కువ కాల వ్యవధి చదువుతో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్న కోర్సు ఐటీఐ. ఐటీఐ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఐటీఐ పూర్తి చేసిన వారిలో 90 శాతం మంది ఉపాధి పొందుతున్నారు. ఐటీఐ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి కల్పించడంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. పదో తరగతి పూర్తి చేసిన వారు ఐటీఐలో చేరడానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

- శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్, తంబళ్లపల్లె ఐటీఐ

జిల్లాలో ఐటీఐ కాలేజీలు ఇలా..

జిల్లాలో మొత్తం 15 ఐటీఐలు ఉండగా అందులో 3 ప్రభుత్వ, 12 ప్రైవేటు ఐటీఐలు ఉన్నాయి. తంబళ్లపల్లె, రాజంపేట, పీలేరుల్లో ఒక్కొక్క ప్రభుత్వ ఐటీఐలు ఉండగా మదనపల్లెలో నాలుగు, రాయచోటిలో రెండు, ములకలచెరువు, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, గుర్రంకొండ, వాల్మీకిపురంలో ఒక్కో ప్రైవేటు ఐటీఐ ఉంది. జిల్లాలో మూడు ప్రభుత్వ ఐటీఐలలో కలిపి 392 సీట్లు, 12 ప్రైవేటు ఐటీఐలలో 1064 సీట్లు ఖాళీలున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ఏడాది, రెండు సంవత్సరాలకు సంబంధించిన కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో రెండు సంవత్సరాలకు సంబంధించి ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మోటార్ వెహికల్ మెకానిక్ కోర్సులు ఉన్నాయి. ఏడాదికి సంబంధించి కంప్యూటర్ కోర్సు, డిజిల్ మెకానిక్, వెల్డర్, వైర్‌మెన్ కోర్సులు ఉన్నాయి.

24 వరకు దరఖాస్తుకు అవకాశం

ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025-26 సంవత్సరంలో ప్రవేశాలకు మొదటి విడతలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. పదోతరగతి తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. అర్హులైన, ఆసక్తి గల విద్యార్థులు ఐటీఐ.ఏపి.జీవోవి.ఇన్ వెబ్‌సైటులో ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలి. లేదా దగ్గరలోని ఐటీఐలో కూడా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారు తప్పనిసరిగా ఏదైనా ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ వద్ద తమ ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లు తీసుకువెళ్లి ఈనెల 26వ తేదీలోగా వెరిఫికేషన్ చేయించుకోవాలి. వెరిఫికేషన్ చేసుకోని పక్షంలో దరఖాస్తులు ఆమోదించబడవు.

మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న వారికి పదో తరగతిలో వచ్చిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రక్రియ ఆధారంగా సీటును కేటాయిస్తారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు వచ్చిన వారికి ట్రేడు ఎంపికలో ప్రాధాన్యం ఉంటుంది. పదిలో సమానమైన మార్కులు వచ్చినపుడు గణితంలో మార్కులు ఎక్కువ వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తారు. గణితంలో కూడా సమానమైన మార్కులు వచ్చి ఉంటే సైన్స్‌లో ఎక్కువ మార్కులు వచ్చిన వారికి, గణితం, సైన్స్ రెండింటిలోనూ సమానమైన మార్కులు వచ్చినపుడు పుట్టిన తేదీని, రిజర్వేషన్ కేటగిరీని పరిగణలోకి తీసుకుని సీటు కేటాయిస్తారు.


ఉన్నత విద్యకు అవకాశం

ఐటీఐలో రెండేళ్ల కోర్సు పూర్తి చేసుకుని ఉన్నత విద్య చదవాలకునే వాళ్లు పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులో చేరడానికి తొలి ప్రాధాన్యం ఇవ్వవచ్చు. ఐటీఐ పూర్తి చేసి బ్రిడ్జి కోర్సు ద్వారా నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం కోర్సుల్లో చేరే అవకాశం ఉంటుంది. డిప్లమా అనంతరం ఆసక్తి ఉంటే బీటెక్, బీఈ కోర్సులు చేయవచ్చు.

ప్రభుత్వ ఐటీఐల్లో ప్రతి నెలా జాబ్‌మేళా

ఐటీఐ శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి నెల ప్రభుత్వ ఐటీఐల్లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఐటీఐతో పాటు పది, ఇంటర్, డిగ్రీ చదివిన విద్యార్థులు కూడా ఈ మేళాకు హాజరు కావచ్చు. ఈ జాబ్‌మేళాకు ఏపీ, ఉమ్మడి అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలోని ప్రముఖ కంపెనీలతో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ నుంచి పలు కంపెనీల ప్రతినిధులు హాజరై నైపుణ్యం, విద్యార్హత ఆధారంగా ఉద్యోగానికి ఎంపిక చేసుకుంటున్నారు.

24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి



ఐటీఐలో చేరదలిచే విద్యార్థులు మే 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఐటీఐలో నేరుగా కూడా అందించవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారు 26వ తేదీలోగా సమీప ఐటీఐ వద్దకు వెళ్లి విధిగా విద్యార్హత ధ్రువపత్రాలను వెరిఫికేషన్ చేయించుకోవాలి. కౌన్సిలింగ్ తేదీ వివరాలను విద్యార్థుల మొబైల్ నెంబరుకు పంపిస్తాం. పదో తరగతి మార్కులు, రిజర్వేషన్ ఆదారంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది.

- నాగరాజు టీవో, తంబళ్లపల్లె ఐటీఐ.

యోగాతో ఆరోగ్యం

సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



సూర్యనమస్కారాలు చేస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): యోగాతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం సిద్ధిస్తుందని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అనేది ఆరోగ్యానికి పునాది అవుతోందన్నారు. యోగా, ప్రాణాయామం, ఆసనాలు, గురించి ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్, యోగా శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండు తనిఖీ

స్థానిక ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం మౌలిక వసతులపై ఫిర్యాదులు రావడంతో సబ్‌కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్లు నిర్వహించడం లేదని, తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు, నీటి నాణ్యతపై 15 రోజులకు ఒకసారి పరీక్షలు చేయాలన్నారు. అద్దె బస్సులను బస్టాండు ప్రాంగణంలో అడ్డదిడ్డంగా నిలిచి ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్లు ఆమరనాథ్, రమణ, రేవతి, గీతా, ఆర్‌అండ్‌బీ ఈఈ అరవింద, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రెడ్డెప్ప, కమిషనర్ ప్రమీల పాల్గొన్నారు.

దళితులపై దాడులు కనిపించలేదా?

కళ్లకు గంతలతో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పీటీఎం శివప్రసాద్, తదితరులు

మదనపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి): దళితులపై దమనకాండ ఈ ప్రభుత్వానికి కనిపించలేదా అని అని వీసీకే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ ప్రశ్నించారు. దళితులపై దాడులను ఖండిస్తూ, బుధవారం బాస్ కార్యాలయంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని మల్లాంలో నెల రోజులుగా దళితుల సాంఘిక బహిష్కరణ కొనసాగుతున్నా, ఇప్పటికీ పవన్‌కల్యాణ్ స్పందించకపోవడం కుల వివక్షకు సంకేతం కాదా?అని ప్రశ్నించారు. విశాఖపట్నంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఎత్తుకెళ్లిపోవడంతో ఇప్పటికీ రిలే దీక్షలు కొనసాగుతున్నాయన్నారు. ప్రకాశం జిల్లాలో అంబేడ్కర్ జయంతి ఊరేగింపును ఆధిపత్య కులాల వాళ్లు అడ్డుకున్నట్లు తెలిపారు. మోహన్‌బాబుకు చెందిన యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్న విద్యార్థి జేమ్స్‌ను కిడ్నాప్ చేసి తీసుకెళ్లి తిరుపతిలోని ఓ లాడ్జిలో ఒకటిన్నర రోజు చిత్రహింసలు పెట్టి ముఖంపై మూత్రం పోశారని ఆరోపించారు. ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నా ప్రభుత్వం ఒక్క సంఘటన మీద కూడా స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో బాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్ల బయన్న, పెద్దపాళెం రవిశంకర్, బురుజు రెడ్డిప్రసాద్, గంపల రమణ, వై.గంగాధర్, జి.బాబు, జి.గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ సస్పెన్షన్

మదనపల్లె టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కోళ్లబైలు-1 పంచాయతీ గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శ్రీధర్ చామకూరి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కోళ్లబైలు-1 గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డి.ద్వారకనాథనాయుడు గతంలో వాల్మీకిపురం మండలం కూరపర్తి గ్రామ సచివాలయంలో విధులు నిర్వహించేటప్పుడు అదే గ్రామానికి చెందిన రెడ్డెప్ప, హరీష్ అనే ఇద్దరి వద్ద పీఎం యోజన పథకం మంజూరు చేయిస్తానని వారి వద్ద రూ.49 వేలను ఫోన్‌పేలో లంచంగా తీసుకున్నాడు. ఈ విషయాన్ని ఏప్రిల్ 28న పీజీఆర్‌ఎస్‌లో బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి నివేదిక ఇవ్వాలని మదనపల్లె ఎంపీడీవోను కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీవో పరిశీలించిన కలెక్టర్ వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారకనాథనాయుడును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ముందస్తు అనుమతి లేకుండా ద్వారకనాథనాయుడు గ్రామాన్ని విడిచి వెళ్లరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అయ్యో..పాపం చిన్నారి...

- రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి
- తల్లి కోసం తల్లడిల్లుతున్న ఆరు నెలల చిన్నారి



సంఘటనా స్థలంలోనే మృతి చెందిన అమ్మాజాన్

ములకలచెరువు, మే 21 (ఆంధ్రజ్యోతి): ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. భర్తతో పాటు ఆరు నెలల చిన్నారికి గాయాలయ్యాయి. దీంతో తల్లి కోసం చిన్నారి ఏడుస్తున్న తీరు చూసిన వారు కంటతడిపెట్టారు. పోలీసుల కథనం మేరకు...మండలంలోని దేవళచెరువుకు చెందిన షామీర్‌బాషా కుమారుడు సమీవుల్లా ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య అమ్మాజాన్, ఆరు నెలల కుమార్తె సాఫియా ఉన్నారు. వారు ముగ్గురు బుధవారం ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా వేపూరికోట క్రాస్‌లో ద్విచక్రవాహనాన్ని టమోటాలు తీసుకెళ్తున్న ఐషర్ వాహనం వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో అమ్మాజాన్ రోడ్డుపై, భర్త సమీవుల్లా, కుమార్తె సాఫియాలు కొంతదూరంలో ఎగిరిపడ్డారు. రోడ్డుపై పడ్డ అమ్మాజన్ (22) తలపై ఐచర్ వాహనం ఎక్కించడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

అలాగే భర్త, ఆరు నెలల కుమార్తె తీవ్రంగా గాయపడ్డారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఐచర్ వాహనం వేగంగా వెనుక వైపు నుంచి వచ్చి ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని గ్రామస్థులు తెలిపారు. మృతి చెందిన మహిళ స్వగ్రామం పెద్దతిప్పసముద్రం మండలం కందుకూరు గ్రామం. ఆమె మృతితో కందుకూరుతో పాటు దేవళచెరువులో విషాదఛాయలు అలుముకున్నాయి.

తల్లి కోసం బిడ్డ ఆరాటం... కంట తడి పెట్టించిన ఘటన



ములకలచెరువులోని వేపూరికోటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవళచెరువు గ్రామానికి చెందిన అమ్మాజాన్ మృతి చెందడం... భర్త, ఆరు నెలల కుమార్తెకు తీవ్రగాయాలైన ఘటన కంట తడి పెట్టించింది. తల్లి కోసం ఆరు నెలల కుమార్తె తల్లడిల్లింది. చనిపోయిన తల్లి వైపు చూసి చిన్నారి భోరున విలపించింది. పాపం తల్లి మృతి చెందిందని కూడా తెలియని వయస్సులో ఉన్న చిన్నారి అమె దగ్గరకు వెళ్లాలని రోదిస్తుండటం చూసిన వారిని కంటతడి పెట్టించింది. గ్రామస్థులు చిన్నారిని ఎత్తుకుని ఎంత సముదాయించినా ఏడుపు ఆపలేదు. తల్లిని చూస్తూ ఏడుస్తున్న చిన్నారిని చూసి అయ్యో...పాపమంటూ కంటనీరు పెట్టుకున్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



నందలూరులో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నందలూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) :ఆపరేషన్ సిందూర్ ఘనవిజయానికి మద్దతుగా బుధవారం సాయంత్రం ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో చేపట్టిన తిరంగా యాత్ర ర్యాలీకి విశేష స్పందన లభించింది. ఈ ర్యాలీ నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని శ్రీకృష్ణ గీతా మందిరం నుంచి నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయం వరకు కొనసాగింది. ర్యాలీలో 100 అడుగులతో జాతీయ జెండాను ఊరేగించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జంగంశెట్టి సుబ్బ య్య, జంబు సూర్యనారాయణ, హిమగిరినాథ్‌యాదవ్, మోడపోతుల రాము, పసుపులేటి ప్రవీణ్, చామంచి పెంచలయ్య, గంధం గంగాధర్, కొట్టే శ్రీహరి, సయ్యద్ అమీర్, ఉప్పుశెట్టి సుధీర్, పాటూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్కిరెడ్డిపల్లెలో... : లక్కిరెడ్డిపల్లెలో గురువారం తిరంగ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల యువజన నాయకుడు యనమల మదన్‌మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

ఆ అతిథి గృహానికి 154 ఏళ్లు

- హార్సిలీహిల్స్‌కు తలమానికం..
- మధురాను భూతులు మిగిల్చే ప్రదేశం

బి.కొత్తకోట, మే 21 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలం పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌కు అటవీశాఖ ప్రాంగణంలో ఉన్న చారిత్రాత్మక అతిథిగృహం తలమానికంగా నిలుస్తోంది. ఒకటిన్నర శతాబ్దం క్రితం ఏనుగుమల్లమ్మ కొండగా పిలువబడే కొండపై ప్రత్యేక శ్రద్ధ కనబరచి మౌలిక సదుపాయాలు కల్పించి, తరతరాలు నిలిచిపోయే నిర్మాణాలను భావితరానికి అందించారు డబ్ల్యూ హెచ్ హార్సిలీ అనే బ్రిటిష్ అధికారి. అందులో అటవీశాఖ సముదాయంలో 1871లో నిర్మించబడిన పురాతన అతిథిగృహం ఒకటి. అప్పటికే ముందస్తు ప్రణాళికతో, చెక్కుచెదరని సాంకేతికతతో విశాలమైన గదులు నిర్మించారు. బ్రిటిష్ అధికారులు మొదలుకొని నేటి వరకు 154 ఏళ్లుగా ఈ అతిథిగృహం సేవలను అందిస్తోంది. ఇటీవల సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ ఉన్నతాధికారుల సహకారంతో దానికి మెరుగులు దిద్దారు. దీంతో లోపలి భాగం అందంగా తయారవ్వడంతో పాటు, రాత్రిళ్లు ఈ కట్టడం మరింత సుందరంగా కనిపిస్తూ పర్యాటకులను కట్టిపడేస్తోంది. సముద్రమట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపి సేదతీరడానికి వచ్చే పర్యాటకులకు ఈ అతిథిగృహం, దీని ముందున్న విశాల ప్రాంగణం మధురానుభూతుల్ని మిగుల్చుతుంది. చల్లనిగాలులు, ప్రశాంతమైన నిశ్శబ్ద వాతావరణంలో అటవీశాఖ అతిథిగృహం ముందు ఎలా ఉంటుందన్నది స్వయంగా అనుభవిస్తే తప్ప, మాటల్లో వర్ణించలేని అనుభవంగా పర్యాటకులు పేర్కొంటుంటారు.



హార్సిలీహిల్స్‌లోని అటవీశాఖ అతిథిగృహం



అతిథి గృహం ఎదుట అటవీ శాఖ ఏర్పాటు చేసిన బోర్డు

ముత్తూట్ ఫైనాన్స్ స్కాంలో ముగ్గురి అరెస్ట్

బి.కొత్తకోట, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగసముద్రం రోడ్డులో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్‌లో నగదు స్వాహా చేసిన ముగ్గురిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు ములకలచెరువు సీఐ లక్ష్మన్న తెలిపారు. ఈ సంస్థలో బంగారు నగలు తనఖా పెట్టి రుణాలు తీసుకున్నవారు చెల్లించిన రూ.66 లక్షలను వారి ఖాతాల్లో జమ చేయకుండా సొంత అవసరాలకు వాడుకున్నారు. ఈ వ్యవహారంపై అంతర్గత విచారణ చేసిన ముత్తూట్ యాజమాన్యం అప్పటి మేనేజర్, మరో ఇద్దరు ఉద్యోగులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ చేసిన అనంతరంమదనపల్లి మండలం పెంచుపాడుకు చెందిన దూదేకుల ఇమ్రాన్‌బాషా(30), పీటీయం మండలం మల్లెలకు చెందిన జరిపిటి హరీష్(29), గుమ్మసముద్రం పంచాయతీ బావగారిపల్లెకు చెందిన యం.హరికృష్ణ (26) ను హార్సిలీహిల్స్ క్రాస్‌వద్ద అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

మినీ లారీ, కారు ఢీ

ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో బోల్తా పడిన మినీ లారీ, దెబ్బతిన్న కారు

కురబలకోట, మే 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు మదనపల్లె రూరల్ ఎస్ఐ గాయత్రి బుధవారం మధ్యాహ్నం తంబళ్లపల్లె నుంచి మదనపల్లెకు వెళుతుండగా ముదివేడు క్రాస్ వద్ద మదనపల్లె నుంచి కడపవైపు టమోటాలను తీసుకువెళుతున్న మినీ లారీ కారును ఢీకొని బోల్తా పడింది. దీంతో బస్సు కోసం రోడ్డు పక్కన నిలుచున్న ములకలచెరువు మండలం చౌటకుంటపల్లెకు చెందిన రెడ్డెమ్మ(50), సత్యసాయి జిల్లా తనకల్లు మండలం నారేవాండ్లపల్లెకు చెందిన అరుణమ్మ(56), కలకడ మండలం పాపిరెడ్డిగారిపల్లెకు చెందిన వెంకట్రమణ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

కేంద్రీయ విద్యాలయానికి స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న సాయిలోకేశ్, అధికారులు

రాజంపేట, మే 21 (ఆంధ్రజ్యోతి) : అధికారుల బృందం బుధవారం కేంద్రీయ విద్యాలయ స్థల పరిశీలన చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేశ్ ఇటీవల కేంద్రీయ విద్యాలయ కమిషనర్ నిధిపాండేను కేంద్రియ విద్యాలయానికి శాశ్వత భవనం కోసం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరితో పాటు కలిశారు. అందుకు స్పందించిన వారు బుధవారం అధికారుల బృందాన్ని పంపారు. ఈ సందర్భంగా రాజంపేటలో కేంద్రీయ విద్యాలయ డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, అసిస్టెంట్ కమిషనర్ అనురాధా, ప్రధానోపాధ్యాయుడు సబ్‌కలెక్టర్ వైఖోం నిదియాదేవిని కలిసి స్థల పరిశీలన కోసం చర్చించారు. అనంతరం తహసీల్దారు పీర్‌మున్నీ, ఆర్ఐ కుమారస్వామి, సర్వేయర్ భవాని, జిల్లా యంత్రాంగంతో కలిసి చర్చించి పలు స్థలాలను పరిశీలించారు. కేంద్రీయ విద్యాలయ బృందం అన్ని వివరాలను పరిశీలించి స్థలాన్ని ఖరారు చేసి నిర్మాణాన్ని ప్రారంభించడానికి అవసరమైన అన్ని పత్రాలను సమర్పించాలని జిల్లా అధికారులను కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



రెడ్డెప్ప (ఫైల్)

మదనపల్లె అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): కరెంట్ షాకుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన పుంగనూరు మండలంలో చోటు చేసుకుంది. ఆస్పత్రి అవుట్ పోలీసుల తెలిపిన వివరాల మేరకు... పుంగనూరు మండలం, చంద్రమాకులపల్లెకు చెందిన కొండప్ప కుమారుడు రెడ్డెప్ప (55) చంద్రమాకులపల్లెలోని సచివాలయంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. బుధవారం సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి మునగాకు పెరికి ఇవ్వాలని కోరడంతో సమీపంలోని చెట్టును ఎక్కి ఆకు కోస్తుండగా కరెంటు తీగ చెట్టు కొమ్మకు తగిలి షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇతనికి భార్య శోభ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈత.. తస్మాత్ జాగ్రత్త







● అప్రమత్తంగా లేకపోతే మృత్యువాత ● విషాదంగా మారుతున్న ఈత సరదా

కడప క్రైం/ వల్లూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం వచ్చిందంటే చాలు చిన్న పెద్ద మహిళలు అనే తేడా లేకుండా సరదాగా ఈత కొట్టాలని ఉవ్విళ్లూరుతుంటారు. స్విమ్మింగ్‌పూల్స్, చెరువులు, నీటి కుంటలు, వాగులు, వంకలు ఇలా ఎక్కడ నీళ్లు ఉంటే పరుగులు పెడుతుం టారు. అయితే ఆ సరదా మాటునే పెనుప్ర మాదం పొంచి ఉంటుందని ఊహించరు. ముఖ్యంగా తెలిసీ తెలియని పిల్లలు సరదాగా ఈత కోసం వాగులు, వంకలు, చెరువుల్లోకి వెళ్లి ప్రాణాలు కోల్పోతూ తల్లిదండ్రులకు గర్భశోక మిగుల్చుతున్నారు. ఈ నేపథ్యంలో సరదాగా ఈత కోసం వెళ్లే వారు తప్పక నిపు ణులు సూచనలు, సలహాలు పాటించాల్సి ఉంది.

జిల్లాలో పెన్నానది, ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట, వాటర్‌గండి బ్రహ్మంసాగర్, గండికోట, మైలవరం, కుందూ, చెయ్యేరు, పాపాఘ్ని సోమశిల లాంటి ప్రాంతాల్లో తరచూ నీటి ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే పెన్నానదిలో పుష్పగిరి క్షేత్రం, సిద్దవటం తదితర ప్రాంతాల్లో సుడిగుండాలు ఉన్నాయి. ఇక్కడ నిరంతరం నీరు ఉండడంతో ఈత కొట్టేందుకు మక్కువ చూపిస్తుంటారు. బ్రహ్మంసాగర్ సమీపంలో పలు చెరువులున్నాయి. అయితే సరదా కోసం ఈతకు వెళ్లి ఆ నీటిలో చిక్కుకుని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. పిల్లలు ఈత ఆడుతున్న సమయంలో పర్యవేక్షణ లేపోవడం, కొంత మంది పెద్దలు చెబితే మందలిస్తారని ఉద్దేశ్యంతో పిల్లలు ఎవరికీ చెప్పకుండా వెళ్లి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. ఇటీవల బ్రహ్మం గారిమఠం సమీపంలోని మల్లేపల్లె చెరువు వద్ద ఐదుగురు పిల్లలు ఈత కోసం వెళ్లి మృత్యువాత పడ్డారు. అలాగే ఆదినిమ్మాయపల్లెడ్యాం వద్ద ఇతర రాష్ట్రాలకు చెందిన ఇరువురు నీటి మునిగి ఊపిరి వదిలారు. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి.

తల్లిదండ్రుల నిఘా తప్పనిసరి

పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా ఉంటూ వారిపై నిఘా ఉంచాలి. స్నేహితులతో కలిసి బయట ఆడుకుంటున్నారా, లేక ఎక్కడికైనా వెళుతున్నారా అని తరచూ గమనిస్తూ ఉండాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో తమకు సమీపంలో చెరువులు ఉంటే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. పిల్లలను ఈత కోసం తీసుకెళ్లాల్సిన అవసరం వచ్చినప్పుడు పెద్దల పర్యవేక్షణలో వారు ఈత ఆడేలా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



కడప నగరానికి సమీపంలో ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట, పెన్నానది ఉండడంతో వేసవిలో ఇక్కడకు పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. సరదా గా ఈతకు దిగే పిల్ల లు, పెద్దలు నదిలో దిగే టప్పుడు ముందుగా సూచిక బోర్డులను గమ నిస్తూ.. చుట్టుపక్కల వ్యక్తుల సలహాలు, సూచ నలు తీసుకోవాలి. పిల్లలకు పెద్దలు తోడుగా ఉం డి ఈత సరదా తీర్చాలి. లేదంటే విషాదాలకు దారి తీసే ప్రమాదం ఉంది.

- పెద్దఓబన్న, వల్లూరు ఎస్ఐ

ఈతకు దిగే ముందుగా...

నీటి ప్రవహం అధికంగా ఉన్న చోట ఈత కొట్టరాదు. నడుం లోతు నీరు ఉండి ప్రవహం లేని చోట మాత్రమే ఈత నేర్చుకోవాలి. ఈత కొట్టే సమయంలో వర్షాలు వస్తే తక్షణమే బయ టికి రావాలి. నిపుణులైన శిక్షకుల వద్ద అన్ని సౌకర్యాలు ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో మాత్రమే ఈత నేర్చుకోవాలి. ఫిట్స్, గుండె జబ్బులు వంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఈతకు దూరంగా ఉండాలి. పురాతనమైన బావుల్లో చెరువుల్లో కర్రలు, రాళ్లు ఉంటాయి. తొందరపడి ఈతకు దూకితే అవి పొడుచుకుని చనిపోయే ప్రమాదం ఉంది.

అంజన్నకు స్నపన తిరుమంజనం



ప్రత్యేక అలంకరణలో అంజన్న ఉత్సవ విగ్రహం

చక్రాయపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రలో జరిగే హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అంజన్నకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. బుధవారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో వేదపండితులచే హోమాలు గావించారు. త్రికాల ఆరాధన, చతురస్థానార్చన, మన్యసూక్తహోమం, పంచముఖ హనుమాన్ మూల మంత్ర హోమం, స్నపన తిరుమంజనం, లఘుపూర్ణాహుతి, గోష్టి నిర్వహించారు. సాయంత్రం త్రికాల ఆరాధన, పంచసూక్త హోమం, సింధూర అర్చన, లఘు పూర్ణాహుతి, గోష్టి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. యజ్ఞాచార్యులు ధర్మగిరి వేదపాఠశాల అధ్యాపకులు రామాను జాచా ర్యులు, వారి శిష్య బృందం స్వామివారికి పూజ కార్యక్రమాలు జరిపించారు. జిల్లా సహాయ కమిషనర్ మల్లికార్జునప్రసాద్, దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ, అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలచార్యులు, రామ మోహన్‌శర్మ, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

గండి ఆలయ పనులను పరిశీలించిన ఆర్జేసీ



ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్

గండి క్షేత్రంలో జరిగే ఆలయ పునర్నిర్మాణ పనులను బుధవారం దేవదాయ ధర్మాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ పరిశీలించారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణఫలంతో స్వాగతం పలికి పూజలు చేశారు. అనంతరం ఆయన హనుమత్ జయంతి హోమాల్లో పాల్గొని హారతులు అందుకున్నారు. అనంతరం ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

పెండింగ్ కేసులను త్వరిత గతిన పూర్తి చేయాలి : ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రమోహన్

బద్వేలు, మే 21 (ఆంధ్రజ్యోతి): బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులపై విచారణ జరిపి త్వరిత గతిన పూర్తిచేయాలని ఆర్డీవో చంద్రమోహన్ పోలీసులకు సూచించారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో డివిజన్‌స్థాయి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ పరిధిలో 20 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని.. త్వరితగతిన విచారణ చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన కేసులపై పోలీసు అధికారులు నిర్లక్ష్యం వహించకుండా బాధితులకు సత్వరమే న్యాయం అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐ రాజగోపాల్, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ దాడుల్లో రేషన్ బియ్యం స్వాధీనం

దువ్వూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దజొన్నవరం గ్రామంలో బుధవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాబడిన సమాచారం మేరకు విజిలెన్స్ డీసీటీవో ఖాజాహుస్సేన్, హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ, కానిస్టేబుల్ టిప్పుసుల్తాన్, సవిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున దాడులు జరిపారు. దువ్వూరుకు చెందిన కొండా శేఖర్ అనే వ్యక్తి గ్రామంలోని ఒక ఇంటిలో అక్రమంగా దాచి ఉంచిన 1728 కిలోలు చౌక దుకాణాలకు సంబంధించిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గ్రామ వీఆర్వో సౌజన్య సమక్షంలో పంచనామా నిర్వహించారు. బియ్యం విలువ రూ.79,542లుగా ఉంటుందని అంచనా వేశారు. పట్టుబడిన బియ్యంను స్థానిక చౌకదుకాణంలో స్వాధీనపరిచారు. అనంతరం బేపారి శేఖర్‌ను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. ఈ విషయాన్ని ఎస్ఐ వినోద్‌కుమార్ ధ్రువీకరించారు.

హత్యాయత్నం కేసులో వైసీపీ నేతల అరెస్టు



అరెస్టు చేసిన నిందితులను చూపుతున్న పోలీసులు

ముద్దనూరు మే 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి చిన్నదుద్యాల గ్రామంలో బీజేపీ నేతలపై దాడికి పాల్పడిన వైసీపీ నేతలను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ దస్తగిరి వివరాల మేరకు... చిన్నదుద్యాల గ్రామంలో మంగళవారం తాగునీటి బోరు మరమ్మతుల విషయంలో బీజేపీ నేతలు వెంకటేశ్వర్లరెడ్డి, శ్రీనివాసులరెడ్డిపై వైసీపీ నేతలు గ్రామ సర్పంచ్ భర్త మదన్‌మోహనరెడ్డి, లక్ష్మిరెడ్డి, ప్రసాద్‌రెడ్డిలు కత్తులతో దాడి చేసి గాయపరిచారు. అప్పటి నుంచి పరారీలో ఉన్నారు. బుధవారం నిందితులు ముద్దనూరు-జమ్మలమడుగు రోడ్డులోని శివాలయం సమీపంలో ఉండగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

భర్త అత్తమామలపై గృహహింస కేసు

పులివెందుల, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజారెడ్డికాలనీకి చెందిన గంగాదేవి అనే మహిళ తన భర్త, అత్తమామలు వేధిస్తున్నారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా... రాజారెడ్డి కాలనీకి చెందిన గంగాదేవిని వేంపల్లెలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన సుబ్బమ్మ, వెంకటేశ్ కుమారుడైన రమణకు ఇచ్చి వివాహం చేశా రు. రమణ, గంగాదేవిలకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. రమణ ఇటీవల వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని గంగాదేవిని వేధిస్తున్నా డు. భర్తతో పాటు అత్తమామలు కూడా వేధిస్తుండడంతో భరించలేక తన పుట్టింటికి వచ్చింది. ఈ మేరకు బాధితురాలు బుధవారం పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై గృహహింస చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

వల్లూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొప్పోలి బస్టాండు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని కుమారునిపల్లె వద్ద ఇటుకల బట్టీ ల్లో పనిచేస్తున్న కూలీలు తిండి తినడానికి వల్లూరు బస్టాండు వైపు నడుచుకుంటూ వెళుతుండగా కొప్పోలి బస్టాండు దాటగానే వల్లూరు వైపు వెళు తున్న ద్విచక్ర వాహనం వారికి తగలడంతో చరణ్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. అలాగే ద్విచక్ర వాహనదారుడికి కూడా తీవ్రగాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన వారిని 108 వాహనం ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు.

రేపటి నుంచి ఏటీఎస్ ద్వారా ఫిట్‌నెస్ పరీక్షలు

సీకేదిన్నె, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా ఏర్పాటైన ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్ (ఏటీఎస్) ద్వారా ఈ నెల 23వ తేదీ శుక్రవారం నుంచి వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఉపరవాణా కమిషనర్ ప్రసాద్ తెలిపారు. పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లె గ్రామంలో ఈ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వాహనదారులు వారి ఫిట్‌నెస్ పరీక్షలకు ఈ కేంద్రం ద్వారా పొందాలని తెలిపారు. ఇకపై ఆర్టీవో కార్యాలయం దగ్గర మ్యాన్యువల్ ఫిట్‌నెస్ పరీక్షలు జరగవని, వాహనదారులు ఈ విషయం గమనించి రవాణా శాఖకు సహకరించాలని కోరారు.

20 లక్షల మొక్కల పెంపకం లక్ష్యం : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టరు శ్రీధర్ చెరుకూరి

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పచ్చదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా 20 లక్షలు మొక్కలు నాటాలని కలెక్టరు శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డు రూం హాలులో డీఎఫ్‌వో వినీత్‌కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టరు మొక్కల పెంపకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండు దశల్లో జూన్ 27న పది లక్షల మొక్కలు, ఆగస్టు 29 తేదీ పది లక్షల మొక్కల పెంపకాన్ని చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు తగు కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో లక్ష్యానికి చేరువగా అడుగులు వేయాలన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటికీ పండ్ల మొక్కలు పంపిణీ చేయాలని సూచించారు. ప్రకృతి సమతుల్యత పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. సామాజిక అటవీ విభాగం వారు మొక్కలు పంపిణీ చేయాలన్నారు. వివిధ సంస్థల కార్యాలయాల్లో, చెరువు గట్లు, ప్రభుత్వ భూములు వంటి అనుకూల ప్రాంతాల్లో మొక్కలను విరివిగా నాటేందుకు సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారిణి రాజ్యలక్ష్మి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, జిల్లా పర్యాటక శాఖ అధికారి సురేశ్, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి : ఆర్జేడీ



విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలను అందజేస్తున్న పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్

కడప ఎడ్యుకేషన్, మే 21 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు అందజేస్తున్న ప్రత్యేక ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని జోన్-4 పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ సూచించారు. బుధవారం సమగ్ర శిక్ష కార్యాలయ ఆవరణలో ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అలింకో ఉపకరణాలను తయారుచేసి అందిస్తోందన్నారు. వీటిని సమగ్ర శిక్ష ఆధ్వ ర్యంలో అర్హులను గుర్తించి అందజేయడం జరుగుతుందన్నారు. ఈ ఉపకరణాలను సద్వినియోగం అయ్యేలా వారి తల్లిదండ్రులు, ప్రత్యేక ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నిత్యానందరాజు, విభిన్న ప్రతిభాంతులశాఖ జిల్లా సంచాలకులు కృష్ణ కిషోర్ మాట్లాడుతూ ఉపకరణాలు దివ్యాంగులు తమ లోపాలను అధిగమించి పురోగమించడానికి అవకాశం కల్పిస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్జేడీ కార్యాలయ ఏడీ విజయకుమార్, సమగ్ర కోఆర్డినేటర్ రమణమూర్తి, కేశవరెడ్డి, విశ్వనాథరెడ్డి, వీరేంద్ర, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థికి షైనింగ్ స్టార్ అవార్డు



విద్యార్థి విఘ్నేశ్‌కు అవార్డు అందజేస్తున్న మంత్రి లోకేశ్

కాశినాయన మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపురం ఏపీ మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరంలో 10 వ తరగతి చదివిన విద్యార్థి బి.విఘ్నేశ్ షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య తెలిపారు. రాష్ట్రంలో ఏపీ మోడల్ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల్లో విఘ్నేశ్ 600కు 593 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచాడన్నారు. ఈమేరకు 20వ తేదీ మంగళవారం విజయవాడలోని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ క్యాంపు కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా తల్లిదండ్రులతో కలిసి విద్యార్థి అవార్డు అందుకున్నారు.

క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాజామొద్దీన్

పులివెందుల రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)ల పరిధిలో ఉన్న క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలని పులివెందుల డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాజా మొహిద్దీన్ సూచించారు. స్థానిక డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో బాకరాపురం యూపీహెచ్‌సీ డాక్టర్ శాంతి కుమార్, నగరిగుట్ట యూపీహెచ్‌సీ డాక్టర్ స్నేహ ప్రత్యూష, మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్యలతో కలిసి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ ఖాజా మొహిద్దీన్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయని, నీటి నిల్వలు ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుం దన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు అందరు జాగ్ర త్తగా ఉండి ఫీవర్ సర్వేలు, లార్వా సర్వేలు నిర్వహించి జ్వరాలను గుర్తించాల్సి ఉంటుందన్నారు. జ్వరాలు ఉన్నట్లు యితే స్థానిక ఆసుపత్రికి వెళ్లేలా చూడాలన్నారు. అలాగే పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేలా క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించాలని తెలిపారు.

వడ్డీభారం లేకుండా క్రాప్‌లోన్స్ రెన్యువల్ చేయాలి : ఎంపీ



పులివెందులలో ఎస్‌బీఐ మేనేజర్‌తో మాట్లాడుతున్న ఎంపీ

పులివెందుల, మే 21 (ఆంధ్రజ్యోతి): రైతులపై వడ్డీభారం లేకుండా పంట రుణాలను రెన్యువల్ చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బ్యాంకు అధికారులను కోరారు. బుధవారం పట్టణంలోని ఎస్‌బీఐ మేనేజర్‌తో, ఆర్ఎంలతో ఎంపీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గత ఏడాది రైతుల క్రాప్‌లోన్స్ రెన్యువల్స్ సమయలో రైతులతో డబ్బులు కట్టించుకొని రైతులకు రెన్యువల్ చేయకుండా బ్యాంకు అధికారుల తప్పిదంతో వదిలేశా రన్నారు. ఇపుడు రైతులపై అధిక వడ్డీ భారం పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పులివెందుల బ్యాంకు మేనేజర్‌తో అన్నారు. అనంతరం ఎస్‌బీఐ కడప రీజనల్ మేనేజర్‌తో అక్కడి నుంచే ఫోన్ చేసి మాట్లాడుతూ రైతులపై ఒక్కరూపాయి భారం పడకుండా క్రాప్‌లోన్స్ రెన్యువల్ చేయాలని సూచించారు. అలాగే రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్, ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం రుణాలు పెంచి ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

రైతుల పక్షాన నిలిచేదెవరు?

● గుర్రంకొండ టమోటా మార్కెట్‌లో దళారులదే ఇష్టారాజ్యం ● వ్యాపారులకు కొమ్ముకాస్తున్న అధికారులు, నాయకులు



గుర్రంకొండ మార్కెట్ యార్డుకు వచ్చిన టమోటాలు

సాగు చేసిన పంటలకు ధరలు లేక అల్లాడుతుంటే జాక్‌పాట్, అధిక కమీషన్‌లు రైతుల పాలిట శాపంగా మారాయి. గుర్రంకొండ మార్కెట్ యార్డులో ఈ పరిస్థితి మరీ అధికంగా ఉంది. టమోటా వ్యాపారుల తీరుతో రైతులు తీవ్రం గా నష్టపోతున్నారు. జిల్లాలో ఎక్కడా లేనంతగాదోచుకుంటున్నా పట్టించుకునే నాథుడు లేడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

గుర్రంకొండ, మే 21 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ టమోటా మార్కెట్ యార్డుకు ప్రతి రోజు వందల టన్నుల్లో రైతులు టమోటాలను తీసుకొస్తున్నారు. ఈ మార్కెట్ యార్డులో 40 మందికి పైగా వ్యాపారులు మండీలను నిర్వహిస్తున్నారు. ఇందులో కొందరు మాత్రమే పెద్ద వ్యాపారులుండగా మిగిలిన వారు సీజన్‌లో మాత్రమే వ్యాపారాలు చేస్తుంటారు. దీంతో పెద్ద వ్యాపారులు మార్కెట్ యార్డు తమ సొంత జాగీరులా భావిస్తున్నారు. మార్కెట్‌లో తాము చె ప్పిందే జరగాలంటూ శాసించే స్థాయికి ఎదిగారు. వీరు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి మద్దతు ఇస్తుండడంతో రాజకీయ అండదండలు రక్షణ కవచంలా నిలు స్తున్నాయి.

దళారీలకు కొమ్ముకాస్తున్న అధికారులు..

గుర్రంకొండ మార్కెట్ యార్డులో టమోటా రైతుల కష్టాలను పట్టించుకోవాల్సిన అధికారులు వ్యాపారులకు కొమ్ముకాస్తుండడంతో వారు ఆడిందే ఆట...పాడిందే పాటగా మారింది. జరిగే వ్యాపారుల ఆగడాలను అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఎన్నిసార్లు ధర్నాలు చేసినా, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోతోందన్న వాదన వినిపిస్తోంది.

నాడు వైసీపీ....నేడు టీడీపీ

గుర్రంకొండ మార్కెట్ యార్డులో వ్యాపారులు కొందరు నాడు వైసీపీకి కొమ్ముకాసి ఎన్నికల్లో సొమ్ము పం చారు. ఆ పార్టీకి అధికారం పోగానే టీడీపీ గూటికి చేరారు. ఆయా పార్టీ ల నాయకుల అండదండలతో రైతులను ఇబ్బందిపెడుతూ కోట్లకు పడగలెత్తుతున్నారు.

అధికారుల పేరుతో అనవసర వ్యాఖ్యలొద్దు

గుర్రంకొండ మార్కెట్ యార్డులో అధికారుల పేరిట కొందరు వ్యాపారులు నోరు జారుతున్నట్లు తెలిసింది. మార్కెట్ యార్డులో సిబ్బందిగానీ, అధికారులుకానీ ఏ వ్యాపారికీ అనుకూలంగా లేరు. మండీ యజమానులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి వ్యాపారాలు చేసుకోవాలి. వ్యాపారులు రైతుల ఎదుట అనవసరంగా మాట్లాడితే చర్యలు తీసుకుంటాం.

- కుమార్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి. వాల్మీకిపురం

పెరిగిన టమోటా ధర



గుర్రంకొండ మార్కెట్‌కు వచ్చిన టమోటాలు

గుర్రంకొండ, మే 21(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌లో కిలో టమోటా ధర బుధవారం రూ.10 పలికింది. గిట్టుబాటు ధరలు లేకపోవడంతో పలువురు రైతులు టమోటాలను తోటలోనే వదిలేశారు. ప్రస్తుతం బయటి రాష్ట్రాల్లో టమోట పంట దెబ్బ తినడంతో ధర పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. 25 కిలో టమోటా క్రేట్ ధర రూ.250 పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా సంతోపు గంగమ్మ తిరునాళ్లు



అమ్మవారికి దివ్వెలు, బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

తంబళ్లపల్లె, మే 21(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండల కేంద్రానికి సమీపంలోని సంతోపులో బుధవారం కోటకొండ గంగమ్మ జాతర నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి మహిళలు కాలినడకన దివ్వెలూ, బోనాలు తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తంబళపల్లె టీడీపీ ఇంచార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి కూటమి నాయకులతో కలసి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం పలు గ్రామాల ప్రజలు చాందినీ బండ్లు మెరవణి చేశారు.

నేడు అభయహస్త ఆంజనేయస్వామి ఊరేగింపు

పీలేరు రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణం యర్రంరెడ్డి గుట్టలోని అభయహస్త ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని గురువారం ఊరేగించనున్నట్లు ఆలయ ధర్మకర్త, పీలేరు జెడ్పీటీసీ సభ్యుడు ఏ.టీ. రత్నశేఖర్ రెడ్డి, ఆలయ అర్చకులు ఎస్. అశోక్ కుమార్ స్వామి తెలిపారు. బుధవారం వారు పీలేరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి ఏటా అభయహస్త ఆంజనేయ స్వామి తిరుణాల అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. 22న ఉదయం 8.30 గంటలకు అభిషేకం, వడపూజ, ఆకుపూజ, హోమం, మధ్యాహ్నం అన్నదానం అనంతరం 3.30 గంటల నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు ప్రారంభమౌతుందన్నారు. ఆలయం నుంచి ప్రకాశం రోడ్, నెహ్రూ బజారు, బ్రాహ్మణ వీధి, పాత బస్టాండ్ మీదుగా మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో కోలాహలంగా ఉంటుందని తెలిపారు.

వీరేష్‌బాబుకు పీహెచ్‌డీ ప్రదానం



మదనపల్లె టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ హెల్త్‌కేర్ మానిటరింగ్ సిస్టమ్స్‌పై పరిశోధన చేసినందుకు మదనపల్లెలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుడు వీరేష్‌బాబుకు చిదంబరంలోని అన్నామలై యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. శస్త్రచికిత్స అనంతరం దీర్ఘకాలిక సంరక్షణ వాతావరణంలో రోగి పునరావాసాన్ని సాంకేతిక ఆధారాలతో ఈ పరిశోధనలో ఆయనవిపులీకరించారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి, అధ్యక్షుడు నాగమల్లారెడ్డి, డైరెక్టర్ రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, సహచర అధ్యాపకులు అభినందిం చారు.

మిట్స్‌లో ఏపీఈఏపీ సెట్‌కు 510 మంది హాజరు

కురబలకోట, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్‌కు 510 మంది విద్యార్థులకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. గురువారం కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు నిర్వహించిన ఈ పరీక్షకు 267 మంది హాజరు కావాల్సి ఉండగా 259 మంది, మధ్యాహ్నం 2గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించిన పరీక్షలకు 267 మందికి గానూ 251మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కళాశాల యాజమాన్యం చర్యలు తీసుకున్నట్లు వివరించారు

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం

● గాయపడిన కార్యకర్తకు జయచంద్రారెడ్డి భరోసా



టీడీపీ కార్యకర్త బాషాను పరామర్శిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

తంబళ్లపల్లె, మే 21(ఆంధ్రజ్యోతి): అధైర్యపడొద్దు..అండగా ఉంటానని టీడీపీ కార్యకర్త షేక్ బాషాకు టీడీపీ ఇంచార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. మండల కేంద్రానికి చెందిన టీడీపీ కార్యకర్త షేక్ బాషా టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. బాషాకు వృద్ధురాలైన తల్లి జమీలాబి, భార్య జరీనా, తొమ్మిది, ఆరో తరగతి చదువుతున్న ఇద్దరు కుమార్తెలు సుహానా, అశ్వానా ఉన్నారు. 2023 జూలైలో బి.కొత్తకోటలో టీడీపీ సమావేశానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో బాషా గాయపడ్డాడు. దీంతో చికిత్సల నిమిత్తం రూ.10 లక్షలకు పైగా ఖర్చు చేశారు. అయినా లేచి నడవలేని స్థితిలో ఉన్నాడు. దీంతో భార్య జరీనా వ్యవసాయ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తోంది. నెల నెల మందులకు రూ.20 వేలకు పైగా ఖర్చు వస్తోందని, ఇద్దరు పిల్లలుండడంతో కుటుంబ పోషణ భారమైందని, తనను ఆదుకోవాలని బాషా టీడీపీ అధిష్టానాన్ని కోరడంతోపాటు, టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డికి ఫోన్ ద్వారా తెలియచేశాడు. దీంతో స్పందించిన ఆయన బుధవారం బాషా ఇంటికికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. ఆసుపత్రి బిల్లులతో వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించాలని స్థానిక నాయకులకు ఆదేశించారు. అధికారులతో మాట్లాడి ఫించను మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బాషా వైద్య ఖర్చులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందచేశారు. ఆయన వెంట టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, కృష్ణమూర్తినాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి బేరిశీన, పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు డేరంగుల చంద్ర, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, పురుషోత్తం, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రామచంద్ర, సుధాకర్ రెడ్డి, వీరాంజనేయులు, కాలానారాయణ, తరుగు శివారెడ్డి, ఆదిరెడ్డి, ఆనంద్, రామాంజులు, నరసింహులు తదితరులు ఉన్నారు.

10లోపు గృహ నిర్మాణ పనులు పూర్తి చేయాలి



పెద్దతిప్పసముద్రం: ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి

పీలేరు రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో అదనపు నిధులు మంజూరైన లబ్దిదారులు జూన్ 10వ తేదీ లోపు గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని పీలేరు హౌసింగ్ ఇన్‌చార్జి డీఈ రమణయ్య తెలిపారు. బుధవారం సాయంత్రం పీలేరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులతోసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పీలేరు మండలానికి 5081 ఇళ్లు మంజూరు అయ్యాయని, ఇందులో 3,151 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఇందులో ఇళ్లు నిర్మించుకోలేక నిర్మాణాలు అర్థాంతరంగా ఆపేసిన వారికి అడిషనల్ ఫైనాన్స్ అసిస్టెన్స్‌లో బాగంగా ఎస్సీ, బీసీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు చొప్పున నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. ఇందులో పీలేరు మండలంలో ఉన్న 438 ఇళ్ల నిర్మాణం నిర్ణీత గడువులోపు పూర్తి చేయడమే లక్ష్యంగా అందరూ ముందుకు పోవాలన్నారు. నిత్యం నిర్మాణ పనులు పర్యవేక్షించాలని సూచించారు. ఎవరైనా ఇందులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: గత ప్రభుత్వంలో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను పూర్తి చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం లబిదారులకు అదనంగా నిధులను మంజూరు చేసినా పనులు వేగవంతం కాకపోవడంపై గృహనిర్మాణ శాఖ డీఈ వెంకటరెడ్డి మండిపడ్డారు. బుధవారం ఆయన మండలపరిషత్ కార్యాలయం లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహనిర్మాణాలు పూర్తి చేయడంపై సిబ్బంది దృష్టి సారించాలన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రూ. 2.28 కోట్లు లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశామని అయినా పనులు చేయడం లేదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేసేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'వడ్డీ వ్యాపారుల వేధింపుల నుంచి రక్షణ కల్పించాలి'

మదనపల్లె అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): అధికవడ్డీలు వసూలు చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని మదనపల్లె పట్టణానికి చెందిన సుజాత, పద్మప్రియరెడ్డి, గౌరీ, నళిని, లావణ్య, నాగవేణి, నాగరత్న, సునీల్ బుధవారం మదనపల్లె డీఎస్పీ మహేంద్రకు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక వడ్డీలకు తీసుకున్న రుణాన్ని పూర్తిగా చెల్లించినా, వడ్డీ వ్యాపారులు ఏకాంబరరెడ్డి, నాగిరెడ్డి, అనురాధ, కుసుమ, భారతి, సుగుణ, సునీత, సరస్వతి, మల్లికార్జున, ఖాదర్‌వలి తమపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ తమ పరువుకు భంగం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి వద్ద తాము తీసుకున్న మొత్తాన్ని పూర్తిగా చెల్లించినా, బాండ్లు, చెక్కులు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. దీంతో ఆ వ్యక్తులపై డీఎస్పీ గారికి ఫిర్యాదు చేయగా, వారిపై కేసులను నమోదు చేస్తామని డీఎస్పీ హామీ ఇచ్చారన్నారు.

'హనుమాన్ శోభాయాత్రకు తరలిరండి'



హిందూ చైతన్య వేదిక సభ్యులతో మాట్లాడుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె అర్బన్, మే21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం నిర్వహించనున్న హనుమాన్ శోభా యాత్రలో హిందూ బంధువులందరూ పాల్గొనాలని హిందూ చైతన్య వేదిక సభ్యులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 17న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, ఆరెస్సెస్ సంయుక్తంగా నిర్వహించతలపెట్టిన ర్యాలీ అర్థాంతరంగా నిలిచిపోయిందన్నారు. హనుమాన్ శోభాయాత్ర ఇలా నిలిచిపోవడం మంచిదికాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, డీఎస్పీ మహేంద్రస సహకారంతో అన్ని అనుమతులతో నిర్వహిస్తున్న ఈ ర్యాలీని అధిక సంఖ్యలో హిందూవులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బండిబాలాజీ, మినర్వా కాఫీ మధు రెడ్డి, శ్రీనివాసులు, మురళీస్వామి, జర్మన్‌రాజు, హేమంత్, అమర, గౌని శంకర, ధీరజ్, తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించాలి

హనుమాన్ శోభాయాత్రను శాంతియుతంగా నిర్వహించాలని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర సూచించారు. బుధవారం ఆయన హిందూ చైతన్య వేదిక సభ్యులతో మాట్లాడుతూ యాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించాలని తెలిపారు. సమన్వయం పాటిస్తూ హిందూబంధువులు బైక్ ర్యాలీలో పాల్గొనాలన్నారు. హిందూ చైతన్య వేదిక సభ్యులు కోరిన విధంగా అనుమతులు ఇచ్చామని తెలిపారు. అనుకున్న మార్గంలో ర్యాలీ జరగడానికి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐలు ఎరిసావలి, రామచంద్ర, కళా వెంకటరమణ, ఎస్ఐలు, హిందూ చైతన్య వేదిక సభ్యులు పాల్గొన్నారు.

'యోగాతో సంపూర్ణ ఆరోగ్యం'

పీలేరు రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పీలేరు తహసీల్దార్ భీమేశ్వర రావు, మదనపల్లె డీవైఈవో లోకేశ్వరర్ రెడ్డి తెలిపారు. బుధవారం పీలేరు సరస్వతి శిశుమందిర్ వద్ద యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి జీవన విధానం యాంత్రికంగా మారడంతో ప్రతి ఒక్కరిలో మానసిక ఆందోళన, మానసిక ఒత్తిడికి గురవుతున్నామని చెప్పారు. తద్వారా అనేక రోగాలు బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. మనలోని ఒత్తిడి, మానసిక ఆందోళనల నుంచి బయటపడడం కోసం యోగా తప్పని సరి అన్నారు. దశాబ్ద కాలంగా యోగా పట్ల అందరూ ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. యోగాలో అనేక ఆసనాలు ఉన్నాయని, ఇందులో ఒక్కో ఆసనం ఒక్కో రకం వ్యాధిని నిర్మూలిస్తుందన్నారు. యోగా సాధనతో కలిగే ఉపయోగాలను గుర్తించి ప్రతి ఒక్కరూ రోజూ సాధన చేయాలని పిలుపునిచ్చారు.

ఫిజియోథెరపీపై శిక్షణ

బి.కొత్తకోట, మే21(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ సిబ్బందికి ఫిజియోథెరపీపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో కృష్ణవేణి పర్యవేక్షణలో నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు చెందిన ఫిజియోథెరపిస్టులు రమేష్‌కుమార్‌రెడ్డి,సంతోష్‌కుమార్ శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్య జీవితంలోపలు ఆరోగ్య సమస్యలు ఏర్పడుతుంటాయని, వాటిలో చాలా సమస్యలకు ఫిజి యోథెరపీ ద్వారా ఉపశమనం పొందవచ్చునన్నారు. వివిధ సమస్యలను ప్రస్తావించి, వాటి నివారణకు చేయాల్సిన ఎక్సర్‌సైజులను ప్రదర్శించారు. సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆక్రమణల పరిశీలన



తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ధనంజయులు

మదనపల్లెఅర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలం, బసినికొండసమీపంలోని ఉర్దూ స్కూల్ వద్ద ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్నారని సమాచారం అందడంతో మదనపల్లె తహసీల్దార్ ధనంజయులు బుధవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఎక్స్‌క వేటర్ సాయంతో ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఆర్ఐ భరత్‌రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బంది నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి



తంబళ్లపల్లె: ఫారంపాండ్ పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

మదనపల్లె టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం సిబ్బంది కేటాయించిన లక్ష్యాలను చేరుకోవాలని డ్వామా పీడీ వెంకటరత్నం ఆదేశించారు. బుధ వారం స్థానిక కార్యాలయంలో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలోని ఏడు మండలాల ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో మట్టిపనులు సులువుగా ఉంటాయన్నారు. మదనపల్లె డివిజన్‌లో 10వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేసి కూలీలకు ఉపాధి అవకాశాలు పెంచాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద 10 వేల ఎకరాల్లో పశుగ్రాసం సాగుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కూలీకీ రూ.300 కూలి వచ్చేలా కృషి చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించేవారు పద్ధతి మార్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీడీ నందకుమార్, ఏపీవోలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: మండలంలోని కుక్కరాజుపల్లెలో ఫారంపాండ్ పనులను పీడీ పరిశీలించారు. కూలీల సమస్యలపై ఆరా తీశారు. ఫారంపాండ్లతో ఉపయోగాలను రైతులకు వివరించారు. ఉపాధిలో పండ్లతోటలు, గడ్డిపెంపకానికి రైతులను ప్రోత్సహించాలని ఏపీవోకు సూచించారు. ఏపీవో అంజినప్ప, జేఈ మహేష్, టెక్నికల్ అసిస్టెంట్ బాలగంగాధర్, ఫీల్డ్ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్



ఫోరం చైర్‌పర్సన్‌కు సమస్యలు వివరిస్తున్న సర్పంచ్ ఈశ్వరయ్య

మదనపల్లె టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికే ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించినట్లు ఫోరం చైర్‌పర్సన్, రిటైర్డ్ న్యాయాధికారి శ్రీనివాస ఆంజనేయమూర్తి తెలిపారు. బుధవారం స్థానిక ఎస్పీడీసీఎల్ కార్యాలయ ఆవరణంలో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల విద్యుత్ వినియోగదారులతో ప్రత్యేక అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరారు. దీనిపై మదనపల్లె రూరల్, పట్టణం, వెస్ట్ సెక్షన్‌ల నుంచి ఎనిమిది మంది ఫిర్యాదు చేశారు. పోతబోలు పంచాయతీ పరిధిలో సమస్యలను సర్పంచ్ ఈశ్వరయ్య ఫోరం దృష్టికి తీసుకొచ్చారు. ఒక నెలలో రూ.4వేలకు పైగా విద్యుత్ బిల్లు వచ్చిందని టిడ్కో ఇంటిలో నివాసం వున్న వినియోగదారుడు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారించి రెండు రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని, పరిష్కరించడానికి వీలులేని వాటిపై ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఫోరం చైర్‌పర్సన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఫోరం సభ్యులు రామ్మోహన్‌రావు, అంజనీకుమార్, విజయలక్ష్మి, ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం, ఏవో బ్రహ్మాయ్యాచారి, ఏడీ హరిబాబు, ఏఈలు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ కేంద్రాన్ని అభివృద్ధి చేయండి

మదనపల్లె టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): హార్సిలీహిల్స్‌లోని స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కేంద్రం అభివృద్ధికి సహకరించాలని జిల్లా కార్యదర్శి ఎం.నరసింహారెడ్డి కోరారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను కలసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. హార్సిలీహిల్స్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కేంద్రంలో రాయలసీమకు చెందిన విద్యార్థులు శిక్షణ పొందుతున్నారన్నారు. 76 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనాలు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే దశలో ఉన్నాయన్నారు. ఈ భవనానికి నీటి సరఫరా కూడా సక్రమంగా లేదని, వీటన్నింటిపై హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ చైర్మన్ అయిన సబ్‌కలెక్టర్ విచారించి నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, జిల్లా జాయింట్ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్, మహ్మద్‌ఖాన్, అన్వర్‌బాషా, లక్ష్మీపతి, భూపతి, గంగాధర్ పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రకు సహకరించండి



శ్రీరామ్‌చినబాబును ఆహ్వానిస్తున్న హనుమాన్ శోభాయాత్ర నిర్వాహకులు

మదనపల్లె టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రకు సహకరించి విజయవంతం చేయాలని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబును హిందూ చైతన్య వేదిక నిర్వాహకులు బండి బాలాజి కోరారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ వద్ద చినబాబు కలసిన హనుమాన్ శోభా యాత్ర నిర్వాహకులు మాట్లాడుతూ హనుమజ్జయంతి సందర్భంగా ర్యాలీని శాంతి యుతంగా నిర్వహిస్తామన్నారు. నాలుగు రోజుల క్రితం చోటుచేసుకున్న సంఘటనల దృష్ట్యా అందరూ ఈ ర్యాలీకి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, మధు, జర్మన్‌రాజు, వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

టీబీ క్యాంపెయిన్‌ను సద్వినియోగం చేసుకోండి



టీబీ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేష్‌బాబు

నిమ్మనపల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): వంద రోజుల టీబీ క్యాంపెయిన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి రమేష్‌బాబు సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలకు జాతీయ క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. మూడు నెలల పాటు చికిత్స చేయించుకొంటే మళ్లీ టీబీ బారిన పడే అవకాశం ఉండదని తెలిపారు. వంద రోజులు జరిగే క్యాంపెయిన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, పర్యవేక్షకుడు నాగిరెడ్డి. ఆసుపత్రి సిబ్బంది దేవకుమారి, ఇందిరాదేవి, సరోజ పాల్గొన్నారు.

వాల్మీకిపురం : చింతపర్తి ఇందిరమ్మ కాలనీలో టీబీ క్యాంపెయిన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల హెల్త్ ఎడ్యుకేటర్ మొహ్మద్‌రఫీ టీబీ వ్యాధి నియంత్రణ విధానం, చికిత్సలపై అవగాహన కల్పించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటాన్ని పాలతో అభిషేకిస్తున్న రేషన్‌డీలర్లు

మదనపల్లె, మే 21(ఆంధ్రజ్యోతి): ఎండీయూ వాహనాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో అన్నమయ్య జిల్లా రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం సీఎం నారా చంద్రబాబు నాయుడు చిత్రపటాన్ని పాలతో అభిషేకించారు. ఏడు దశాబ్దాలుగా నడుస్తున్న రేషన్ డీలర్లకు సమాంతరంగా ఎండీయూ వాహనాలు తేవడంతో ప్రభుత్వానికి అదనపు ఖర్చుతోపాటు, కార్డుదారులకు సకాలంలో బియ్యం అందకుండా పోయింది. ఈ విధానాన్ని రద్దు చేసి, జూన్ నుంచి రేషన్ డీలర్ల ద్వారానే నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సి.సుధీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మౌలాలి, అంజాద్, అఫ్జల్, బషీర్, ఇలియాస్, కోటేశ్వరరావు, సుబ్బరాయుడు, బుజ్జిబాబు, రెడ్డెప్ప, నాగరాజ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కంపోస్టుయార్డులో ఐటీసీ బృందం పరిశీలన



కమిషనర్ ప్రమీల నుంచి వివరాలు తీసుకుంటున్న ఐటీసీ ప్రతినిధులు

మదనపల్లె, మే 21(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఐటీసీ కంపెనీ బృందం మదనపల్లెలోని కంపోస్టు యార్డును పరిశీలించింది. మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీలతో కలసి బుధవారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటన అనంతరం కంపోస్టుయార్డుకు చేరుకుని రోజువారి యార్డుకు వచ్చే చెత్తను అంచనా వేశారు. ముఖ్యంగా డ్రైవేస్ట్‌పై ఆరా తీశారు. ఇంటింటా వెలువడే చెత్తలో డ్రైవేస్ట్ ద్వారా తయారయ్యే ఎరువును పరిశీలించారు. ఇప్పటికే మహేంద్ర కంపెనీ ద్వారా ఈప్రక్రియ నిర్వహిస్తుండగా, తాజాగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌తో ఐటీసీ కంపెనీ ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా మొదటిసారిగా ఆ కంపెనీకి చెందిన సభ్యులు శ్రీనివాసులు, హేమావతి ఇక్కడికి చేరుకుని ఇక్కడి పరిస్థితిని తెలుసుకున్నారు. తర్వాత కంపెనీ తరపున చెత్త సేకరణ, నిర్వహణపై వలంటీర్లను నియమించి ప్రక్రియ మొదలు పెట్టనున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.

మినీ మహానాడు స్థలం మార్పు

మదనపల్లె టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం నిర్వహించనున్న మినీ మహానాడు వేదిక మార్చినట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంతగేటు వద్ద ప్యారడైజ్ ఫంక్షన్ హాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మినీ మహానాడు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందరు తప్పక హాజరు కావాలని ఎమ్మెల్యే కోరారు.

ఐటీఐలో శిక్షణ...ఉపాధికి నిచ్చెన

- విద్యార్థుల నైపుణ్యానికి పెద్దపీట
- కోర్సులు పూర్తి కాగానే ఉద్యోగావకాశాలు
- ఈనెల 24 వరకే దరఖాస్తుకు గడువు

తంబళ్లపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి): యువతలో తక్కువ సమయంలోనే నైపుణ్యాలు పెంపొందించి త్వరగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఐటీఐ (పారిశ్రామిక శిక్షణా సంస్థ)లు ఎంతగానో దోహదపడుతున్నాయి. యువతకు తక్కువ కాల వ్యవధిలో వివిధ ట్రేడ్లలో శిక్షణ ఇచ్చి వారి భవిష్యత్తుకు సోపానమార్గాలుగా మారుతున్నాయి. ఐటీఐ ట్రేడ్‌లలో ఏ కోర్సు పూర్తి చేసినా ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రధానంగా రైల్వే, రక్షణ, ఆర్మీ, ఆర్టీసీ, విద్యుత్ వంటి ప్రభుత్వ, ఇతర ప్రైవేటు రంగ సంస్థల్లో ఉద్యోగావకాశాలు పొందడానికి అవకాశం ఉంటుంది. పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పనలో ఐటీఐ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. ఇక స్వయంగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.



తంబళ్లపల్లెలోని టీఎన్‌వీఎస్ఆర్ఎం ప్రభుత్వ ఐటీఐ



తంబళ్లపల్లె ఐటీఐలో ఫిట్టర్ ట్రేడ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఐటీఐతో మంచి ఉపాధి అవకాశాలు



తక్కువ కాల వ్యవధి చదువుతో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్న కోర్సు ఐటీఐ. ఐటీఐ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఐటీఐ పూర్తి చేసిన వారిలో 90 శాతం మంది ఉపాధి పొందుతున్నారు. ఐటీఐ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి కల్పించడంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. పదో తరగతి పూర్తి చేసిన వారు ఐటీఐలో చేరడానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

- శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్, తంబళ్లపల్లె ఐటీఐ

జిల్లాలో ఐటీఐ కాలేజీలు ఇలా..

జిల్లాలో మొత్తం 15 ఐటీఐలు ఉండగా అందులో 3 ప్రభుత్వ, 12 ప్రైవేటు ఐటీఐలు ఉన్నాయి. తంబళ్లపల్లె, రాజంపేట, పీలేరుల్లో ఒక్కొక్క ప్రభుత్వ ఐటీఐలు ఉండగా మదనపల్లెలో నాలుగు, రాయచోటిలో రెండు, ములకలచెరువు, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, గుర్రంకొండ, వాల్మీకిపురంలో ఒక్కో ప్రైవేటు ఐటీఐ ఉంది. జిల్లాలో మూడు ప్రభుత్వ ఐటీఐలలో కలిపి 392 సీట్లు, 12 ప్రైవేటు ఐటీఐలలో 1064 సీట్లు ఖాళీలున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ఏడాది, రెండు సంవత్సరాలకు సంబంధించిన కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో రెండు సంవత్సరాలకు సంబంధించి ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మోటార్ వెహికల్ మెకానిక్ కోర్సులు ఉన్నాయి. ఏడాదికి సంబంధించి కంప్యూటర్ కోర్సు, డిజిల్ మెకానిక్, వెల్డర్, వైర్‌మెన్ కోర్సులు ఉన్నాయి.

24 వరకు దరఖాస్తుకు అవకాశం

ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025-26 సంవత్సరంలో ప్రవేశాలకు మొదటి విడతలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. పదోతరగతి తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. అర్హులైన, ఆసక్తి గల విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైటులో ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలి. లేదా దగ్గరలోని ఐటీఐలో కూడా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారు తప్పనిసరిగా ఏదైనా ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ వద్ద తమ ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లు తీసుకువెళ్లి ఈనెల 26వ తేదీలోగా వెరిఫికేషన్ చేయించుకోవాలి. వెరిఫికేషన్ చేసుకోని పక్షంలో దరఖాస్తులు ఆమోదించబడవు.

మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న వారికి పదో తరగతిలో వచ్చిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రక్రియ ఆధారంగా సీటును కేటాయిస్తారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు వచ్చిన వారికి ట్రేడు ఎంపికలో ప్రాధాన్యం ఉంటుంది. పదిలో సమానమైన మా ర్కులు వచ్చినపుడు గణితంలో మార్కులు ఎక్కువ వచ్చి న వారికి ప్రాధాన్యత ఇస్తారు. గణితంలో కూడా సమానమైన మార్కులు వచ్చి ఉంటే సైన్స్‌లో ఎక్కువ మార్కులు వచ్చిన వారికి, గణితం, సైన్స్ రెండింటిలోనూ సమానమైన మార్కులు వచ్చినపుడు పుట్టిన తేదీని, రిజర్వేషన్ కేటగిరీని పరిగణలోకి తీసుకుని సీటు కేటాయిస్తారు.

ఉన్నత విద్యకు అవకాశం

ఐటీఐలో రెండేళ్ల కోర్సు పూర్తి చేసుకుని ఉన్నత విద్య చదవాలకునే వాళ్ల పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులో చేరడానికి తొలి ప్రాధాన్యం ఇవ్వవచ్చు. ఐటీఐ పూర్తి చేసి బ్రిడ్జి కోర్సు ద్వారా నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం కోర్సుల్లో చేరే అవకాశం ఉంటుంది. డిప్లమా అనంతరం ఆసక్తి ఉంటే బీటెక్, బీఈ కోర్సులు చేయవచ్చు.

ప్రభుత్వ ఐటీఐల్లో ప్రతి నెలా జాబ్‌మేళా

ఐటీఐ శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి నెల ప్రభుత్వ ఐటీఐల్లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఐటీఐతో పాటు పది, ఇంటర్, డిగ్రీ చదివిన విద్యార్థులు కూడా ఈ మేళాకు హాజరు కావచ్చు. ఈ జాబ్‌మేళాకు ఏపీ, ఉమ్మడి అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలోని ప్రముఖ కంపెనీలతో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ నుంచి పలు కంపెనీల ప్రతినిధులు హాజరై నైపుణ్యం, విద్యార్హత ఆధారంగా ఉద్యోగానికి ఎంపిక చేసుకుంటున్నారు.

24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి



ఐటీఐలో చేరదలిచే విద్యార్థులు మే 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఐటీఐలో నేరుగా కూడా అందించవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారు 26వ తేదీలోగా సమీప ఐటీఐ వద్దకు వెళ్లి విధిగా విద్యార్హత ధ్రువపత్రాలను వెరిఫికేషన్ చేయించుకోవాలి. కౌన్సిలింగ్ తేదీ వివరాలను విద్యార్థుల మొబైల్ నెంబరుకు పంపిస్తాం. పదో తరగతి మార్కులు, రిజర్వేషన్ ఆదారంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది.

- నాగరాజు టీవో, తంబళ్లపల్లె ఐటీఐ.

యోగాతో ఆరోగ్యం

సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



సూర్యనమస్కారాలు చేస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): యోగాతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం సిద్ధిస్తుందని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అనేది ఆరోగ్యానికి పునాది అవుతోందన్నారు. యోగా, ప్రాణాయామం, ఆసనాలు, గురించి ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్, యోగా శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండు తనిఖీ

స్థానిక ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం మౌలిక వసతులపై ఫిర్యాదులు రావడంతో సబ్‌కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్లు నిర్వహించడం లేదని, తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు, నీటి నాణ్యతపై 15 రోజులకు ఒకసారి పరీక్షలు చేయాలన్నారు. అద్దె బస్సులను బస్టాండు ప్రాంగణంలో అడ్డదిడ్డంగా నిలిచి ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్లు ఆమరనాథ్, రమణ, రేవతి, గీతా, ఆర్అండ్‌బీ ఈఈ అరవింద, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రెడ్డెప్ప, కమిషనర్ ప్రమీల పాల్గొన్నారు.

అయ్యో..పాపం చిన్నారి...

- రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి
- తల్లి కోసం తల్లడిల్లుతున్న ఆరు నెలల చిన్నారి

ములకలచెరువు, మే 21 (ఆంధ్రజ్యోతి): ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. భర్తతో పాటు ఆరు నెలల చిన్నారికి గాయాలయ్యాయి. దీంతో తల్లి కోసం చిన్నారి ఏడుస్తున్న తీరు చూసిన వారు కంటతడిపెట్టారు. పోలీసుల కథనం మేరకు...మండలంలోని దేవళచెరువుకు చెందిన షామీర్‌బాషా కుమారుడు సమీవుల్లా ఆటోడ్రైవర్‌గా పని



సంఘటనా స్థలంలోనే మృతి చెందిన అమ్మాజాన్

చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య అమ్మాజాన్, ఆరు నెలల కుమార్తె సాఫియా ఉన్నారు. వారు ముగ్గురు బుధవారం ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా వేపూరికోట క్రాస్‌లో ద్విచక్రవాహనాన్ని టమోటాలు తీసుకెళ్తున్న ఐషర్ వాహనం వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో అమ్మాజాన్ రోడ్డుపై, భర్త సమీవుల్లా, కుమార్తె సాఫియాలు కొంతదూరంలో ఎగిరిపడ్డారు. రోడ్డుపై పడ్డ అమ్మాజన్ (22) తలపై ఐచర్ వాహనం ఎక్కించడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

అలాగే భర్త, ఆరు నెలల కుమార్తె తీవ్రంగా గాయపడ్డారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఐచర్ వాహనం వేగంగా వెనుక వైపు నుంచి వచ్చి ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని గ్రామస్థులు తెలిపారు. మృతి చెందిన మహిళ స్వగ్రామం పెద్దతిప్పసముద్రం మండలం కందుకూరు గ్రామం. ఆమె మృతితో కందుకూరుతో పాటు దేవళచెరువులో విషాదఛాయలు అలుముకున్నాయి.

తల్లి కోసం బిడ్డ ఆరాటం... కంట తడి పెట్టించిన ఘటన



ములకలచెరువులోని వేపూరికోటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవళచెరువు గ్రామానికి చెందిన అమ్మాజాన్ మృతి చెందడం... భర్త, ఆరు నెలల కుమార్తెకు తీవ్రగాయాలైన ఘటన కంట తడి పెట్టించింది. తల్లి కోసం ఆరు నెలల కుమార్తె తల్లడిల్లింది. చనిపోయిన తల్లి వైపు చూసి చిన్నారి భోరున విలపించింది. పాపం తల్లి మృతి చెందిందని కూడా తెలియని వయస్సులో ఉన్న చిన్నారి అమె దగ్గరకు వెళ్లాలని రోదిస్తుండటం చూసిన వారిని కంటతడి పెట్టించింది. గ్రామస్థులు చిన్నారిని ఎత్తుకుని ఎంత సముదాయించినా ఏడుపు ఆపలేదు. తల్లిని చూస్తూ ఏడుస్తున్న చిన్నారిని చూసి అయ్యో...పాపమంటూ కంటనీరు పెట్టుకున్నారు.

ముత్తూట్ ఫైనాన్స్ స్కాంలో ముగ్గురి అరెస్ట్

బి.కొత్తకోట, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగసముద్రం రోడ్డులో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్‌లో నగదు స్వాహా చేసిన ముగ్గురిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు ములకలచెరువు సీఐ లక్ష్మన్న తెలిపారు. ఈ సంస్థలో బంగారు నగలు తనఖా పెట్టి రుణాలు తీసుకున్నవారు చెల్లించిన రూ.66 లక్షలను వారి ఖాతాల్లో జమ చేయకుండా సొంత అవసరాలకు వాడుకున్నారు. ఈ వ్యవహారంపై అంతర్గత విచారణ చేసిన ముత్తూట్ యాజమాన్యం అప్పటి మేనేజర్, మరో ఇద్దరు ఉద్యోగులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ చేసిన అనంతరంమదనపల్లి మండలం పెంచుపాడుకు చెందిన దూదేకుల ఇమ్రాన్‌బాషా(30), పీటీయం మండలం మల్లెలకు చెందిన జరిపిటి హరీష్(29), గుమ్మసముద్రం పంచాయతీ బావగారిపల్లెకు చెందిన యం.హరికృష్ణ (26) ను హార్సిలీహిల్స్ క్రాస్‌వద్ద అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

మినీ లారీ, కారు ఢీ

ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో బోల్తా పడిన మినీ లారీ, దెబ్బతిన్న కారు

కురబలకోట, మే 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు మదనపల్లె రూరల్ ఎస్ఐ గాయత్రి బుధవారం మధ్యాహ్నం తంబళ్లపల్లె నుంచి మదనపల్లెకు వెళుతుండగా ముదివేడు క్రాస్ వద్ద మదనపల్లె నుంచి కడపవైపు టమోటాలను తీసుకువెళుతున్న మినీ లారీ కారును ఢీకొని బోల్తా పడింది. దీంతో బస్సు కోసం రోడ్డు పక్కన నిలుచున్న ములకలచెరువు మండలం చౌటకుంటపల్లెకు చెందిన రెడ్డెమ్మ(50), సత్యసాయి జిల్లా తనకల్లు మండలం నారేవాండ్లపల్లెకు చెందిన అరుణమ్మ(56), కలకడ మండలం పాపిరెడ్డిగారిపల్లెకు చెందిన వెంకట్రమణ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

కమ్మపల్లెలో ఏనుగుల దాడులు

సోమల, మే 21 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మంగళవారం రాత్రి చిన్నఉప్పరపల్లె పంచాయతీ కమ్మపల్లె సమీపంలోని మామిడి, టమోటా తోటల్లో ఏనుగుల గుంపు చేరుకొని పంటలను ధ్వంసం చేశాయి. రైతులు రమణ, వెంకట్రామయ్య మామిడి తోటల్లో మామిడి కాయలను తిన్నంత తిని కొమ్మలను విరిచేశాయి. కోత సమయంలో ఏనుగుల సంచారంతో రైతులు ఆందోళన పడుతున్నారు.

దళితులపై దాడులు కనిపించలేదా?

కళ్లకు గంతలతో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పీటీఎం శివప్రసాద్, తదితరులు

మదనపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి): దళితులపై దమనకాండ ఈ ప్రభుత్వానికి కనిపించలేదా అని అని వీసీకే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ ప్రశ్నించారు. దళితులపై దాడులను ఖండిస్తూ, బుధవారం బాస్ కార్యాలయంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని మల్లాంలో నెల రోజులుగా దళితుల సాంఘిక బహిష్కరణ కొనసాగుతున్నా, ఇప్పటికీ పవన్‌కల్యాణ్ స్పందించకపోవడం కుల వివక్షకు సంకేతం కాదా?అని ప్రశ్నించారు. విశాఖపట్నంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఎత్తుకెళ్లిపోవడంతో ఇప్పటికీ రిలే దీక్షలు కొనసాగుతున్నాయన్నారు. ప్రకాశం జిల్లాలో అంబేద్కర్ జయంతి ఊరేగింపును ఆధిపత్య కులాల వాళ్లు అడ్డుకున్నట్లు తెలిపారు. మోహన్‌బాబుకు చెందిన యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్న విద్యార్థి జేమ్స్‌ను కిడ్నాప్ చేసి తీసుకెళ్లి తిరుపతిలోని ఓ లాడ్జిలో ఒకటిన్నర రోజు చిత్రహింసలు పెట్టి ముఖంపై మూత్రం పోశారని ఆరోపించారు. ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నా ప్రభుత్వం ఒక్క సంఘటన మీద కూడా స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో బాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్ల బయన్న, పెద్దపాళెం రవిశంకర్, బురుజు రెడ్డిప్రసాద్, గంపల రమణ, వై.గంగాధర్, జి.బాబు, జి.గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆ అతిథి గృహానికి 154 ఏళ్లు

- హార్సిలీహిల్స్‌కు తలమానికం..
- మధురాను భూతులు మిగిల్చే ప్రదేశం

బి.కొత్తకోట, మే 21 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలం పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌కు అటవీశాఖ ప్రాంగణంలో ఉన్న చారిత్రాత్మక అతిథిగృహం తలమానికంగా నిలుస్తోంది. ఒకటిన్నర శతాబ్దం క్రితం ఏనుగుమల్లమ్మ కొండగా పిలువబడే కొండపై ప్రత్యేక శ్రద్ధ కనబరచి మౌలిక సదుపాయాలు కల్పించి, తరతరాలు నిలిచిపోయే నిర్మాణాలను భావితరానికి అందించారు డబ్ల్యు హెచ్ హార్సిలీ అనే బ్రిటిష్ అధికారి. అందులో అటవీశాఖ సముదాయంలో 1871లో నిర్మించబడిన పురాతన అతిథిగృహం ఒకటి. అప్పటికే ముందస్తు ప్రణాళికతో, చెక్కుచెదరని సాంకేతికతతో విశాలమైన గదులు నిర్మించారు. బ్రిటిష్ అధికారులు మొదలుకొని నేటి వరకు 154 ఏళ్లుగా ఈ అతిథిగృహం సేవలను అందిస్తోంది. ఇటీవల సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ ఉన్నతాధికారుల సహకారంతో దానికి మెరుగులు దిద్దారు. దీంతో లోపలి భాగం అందంగా తయారవ్వడంతో పాటు, రాత్రిళ్లు ఈ కట్టడం మరింత సుందరంగా కనిపిస్తూ పర్యాటకులను కట్టిపడేస్తోంది. సముద్రమట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపి సేదతీరడానికి వచ్చే పర్యాటకులకు ఈ అతిథిగృహం, దీని ముందున్న విశాల ప్రాంగణం మధురానుభూతుల్ని మిగుల్చుతుంది. చల్లనిగాలులు, ప్రశాంతమైన నిశ్శబ్ద వాతావరణంలో అటవీశాఖ అతిథిగృహం ముందు ఎలా ఉంటుందన్నది స్వయంగా అనుభవిస్తే తప్ప, మాటల్లో వర్ణించలేని అనుభవంగా పర్యాటకులు పేర్కొంటుంటారు.



హార్సిలీహిల్స్‌లోని అటవీశాఖ అతిథిగృహం



అతిథి గృహం ఎదుట అటవీ శాఖ ఏర్పాటు చేసిన బోర్డు

వెల్ఫేర్ అసిస్టెంట్ సస్పెన్షన్

మదనపల్లె టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కోళ్లబైలు-1 పంచాయతీ గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శ్రీధర్ చామకూరి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కోళ్లబైలు-1 గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డి.ద్వారకనాథనాయుడు గతంలో వాల్మీకిపురం మండలం కూరపర్తి గ్రామ సచివాలయంలో విధులు నిర్వహించేటప్పుడు అదే గ్రామానికి చెందిన రెడ్డెప్ప, హరీష్ అనే ఇద్దరి వద్ద పీఎం యోజన పథకం మంజూరు చేయిస్తానని వారి వద్ద రూ.49 వేలను ఫోన్‌పేలో లంచంగా తీసుకున్నాడు. ఈ విషయాన్ని ఏప్రిల్ 28న పీజీఆర్ఎస్‌లో బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి నివేదిక ఇవ్వాలని మదనపల్లె ఎంపీడీవోను కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీవో పరిశీలించిన కలెక్టర్ వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారకనాథనాయుడును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ముందస్తు అనుమతి లేకుండా ద్వారకనాథనాయుడు గ్రామాన్ని విడిచి వెళ్లరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



రెడ్డెప్ప (ఫైల్)

మదనపల్లె అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): కరెంట్ షాకుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన పుంగనూరు మండలంలో చోటు చేసుకుంది. ఆస్పత్రి అవుట్ పోలీసుల తెలిపిన వివరాల మేరకు... పుంగనూరు మండలం, చంద్రమాకులపల్లెకు చెందిన కొండప్ప కుమారుడు రెడ్డెప్ప (55) చంద్రమాకులపల్లెలోని సచివాలయంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. బుధవారం సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి మునగాకు పెరికి ఇవ్వాలని కోరడంతో సమీపంలోని చెట్టును ఎక్కి ఆకు కోస్తుండగా కరెంటు తీగ చెట్టు కొమ్మకు తగిలి షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇతనికి భార్య శోభ, ఇద్దరు కుమారైలు ఉన్నారు. పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతిపై కత్తితో దాడి

- యువకుడికి దేహశుద్ధి

సోమల, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న యువతి గొంతు కోసి తీవ్రంగా గాయపరచిన యువకుడికి గ్రామస్తులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన సోమల మండలంలో బుధవారం జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు... ఇరికిపెంట పంచాయతీ పార్వతీపురానికి చెందిన మాన్యం రెడ్డెప్ప నాయుడు కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లారు. రెడ్డెప్ప నాయుడి చిన్న కుమార్తె రమ్య ఇంటి వద్ద ఒంటరిగా ఉంది. గ్రామానికి చెందిన శ్రీనివాసులు రమ్య ఇంటికి చేరుకుని మెడపై కత్తితో గాయపరిచి పరారయ్యాడు.గమనించిన గ్రామస్తులు శ్రీనివాసులును పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.దాడిలో గాయపడిన శ్రీనివాసులును పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు, రమ్యను మదనపల్లె వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు.